
నవతెలంగాణ 1
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
మంగళవారం 14 ఫిబ్రవరి 2023



కంటివెలుగును వినియోగించుకోండి

కార్పొరేటర్ పుష్ప నాగేష్

నవ తెలంగాణ-రామచంద్రాపురం

కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజల వినియోగించుకోవాలని రామచంద్రపురం కార్పొరేటర్ పుష్ప నగేష్ అన్నారు. రామచంద్రాపురం డివిజన్‌లోని రామచంద్రారెడ్డి నగర్ కాలనీలో 2వ విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని సోమవారం రామచంద్రారెడ్డి నగర్ కాలనీ కమ్యూనిటీ భవనంలో కార్పొరేటర్ పుష్ప నగేష్ ప్రారంభించారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు బొమ్మ చంద్రశేఖర్ గుప్త, జగన్నాథ్ రెడ్డి, వాసుదేవ్, రాజి రెడ్డి, సహదేవ్ గౌడ్, రమేష్, ప్రతాపరెడ్డి, డాక్టర్ కనిశ్రీ, కాలనీవాసులు, సిబ్బంది పాల్గొన్నారు.



'ప్రకృతి వరం ప్రేమ' ఎక్రలిక్ చిత్రం ఆవిష్కరణ

నవ తెలంగాణ - సిద్దిపేట

ఈ నెల 14న ప్రేమికుల రోజును పురస్కరించుకుని రుస్తుం ఆర్ట్ గ్యాలరీ సిద్దిపేటలో 'ప్రకృతి వరం ప్రేమ' ఎక్రలిక్ చిత్రాన్ని అంతర్జాతీయ చిత్రకారులు రుస్తుం సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వరప్రసాదం ప్రేమ... చేయకెన్నడూ దానికి నమ్మక ద్రోహమన్నారు. విశ్వానికి ప్రేమే మూలం... చరాచర సృష్టికి ఆధారం అని అన్నారు. ప్రేమికుల రోజు ప్రపంచంలో అందరికి స్వచ్ఛమైన ప్రేమను, శాంతిని, ఐక్యతను అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ ఎ ఎఫ్ అధ్యక్షురాలు జులేఖరుస్తుం, నైరూప్య చిత్రకారుడు నహీంరుస్తుం తదితరులు పాల్గొన్నారు.



ప్రజా సమస్యలు పరిష్కరించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ ముజామిల్ ఖాన్



నవ తెలంగాణ-కొండపాక

ప్రజా సమస్యలు విని పరిష్కరించడానికి మొదలుపెట్టిన కార్యక్రమం ప్రజావాణి అని, ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలను పరిష్కరించాలని జిల్లా అదనపు పాలనాధికారి ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లా రెవెన్యూ అదనపు పాలనాధికారి శ్రీనివాస్‌రెడ్డి తో కలిసి అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుంచి తమ సమస్యలు నేరుగా విన్నవించి పరిష్కరించుకోవడానికి అర్జీదారులు ఎంతో ఆశతో కార్యాలయానికి వస్తారని, వారందరికీ న్యాయం చేయడం అధికారులుగా మన కర్తవ్యమని తెలిపారు. అర్జీదారుల నుండి తీసుకున్న ఫిర్యాదులు త్వరగా పరిష్కరించి నివేదిక అందించాలన్నారు. అర్జీదారులకు ప్రజావాణి కార్యక్రమంపై నమ్మకం పెరిగిందన్నారు. క్రమంగా అర్జీదారుల సంఖ్య పెరుగుతుండడంతో అధికారులు ఉత్సాహంతో పని చేయాలన్నారు. భూ సంబంధిత, రెండు పడక గదుల ఇండ్లు, ఆసరా పింఛన్లు ఇతరత్రా మొత్తం 81 దరఖాస్తులు అందాయని తెలిపారు. అనంతరం రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా జారీచేసిన ఫైనాన్సియల్ లిటరసీ వీక్-2023 ఫ్లెక్సీ, పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఎఓ అబ్దుల్ రహమాన్ జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంపై దృష్టి సారించాలి

నవతెలంగాణ-సంగారెడ్డి

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల సత్వర పరిష్కారంపై దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులు ఇచ్చిన 36 దరఖాస్తులను అదనపు కలెక్టర్ వీరారెడ్డి స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణిలో ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పెట్టుకున్న అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఆయా అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు ఇచ్చి,ఆయా శాఖల అధికారులు అర్జీదారులు కార్యాలయాల చుట్టూ తిరగకుండా, తమ పరిధిలో పరిష్కరించ గలిగినవి వెంటనే పరిష్కరించాలని సూచించారు. రెవెన్యూ శాఖకు సంబంధించి 17 అర్జీలు రాగా,ఇతర శాఖలకు సంబంధించి 19 అర్జీ లు వచ్చాయి.భూ సమస్యల పరిష్కారం,డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల మంజూరీ,ఆసరా పింఛన్లు,స్వయం ఉపాధి కల్పనకు రుణం మంజూరీ,మూడు చక్రాల సైకిల్ ఇప్పించాలని తదితరాలపై అర్జీ దారులు దరఖాస్తులు సమర్పించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ తదితరులు పాల్గొన్నారు.



పరిశ్రమలలో ప్రమాదాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కె.రాజయ్య



నవతెలంగాణ-రామచంద్రాపురం

'పరిశ్రమలలో ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి. ప్రమాదాలు జరిగిన యజమానులను శిక్షించాలి' అని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కె.రాజయ్య అన్నారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ పరిశ్రమల యజమానుల పనితీరు కారణంగానే ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపించారు, పరిశ్రమలకు లాభాల మీద ఉన్న దృష్టి ప్రమాదాలు జరగకుండా ఎలాంటి చర్యలు తీసుకోవట్లేదన్నారు. నెల రోజులలోనే బొల్లారం, కాజిపల్లి బొంతపల్లి, పాశమైలారం ప్రాంతాలలో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. మైలాన్‌లో ముగ్గురు మృతి చెందారని, లీఫార్మలాలో ఒకరు గాయపడగా, మోల్డ్ టెక్‌లో ఒకరు మృతి చెందారని, కేకులేలో ఎస్ఎంఎస్‌లలో ప్రమాదాలు జరిగాయని గుర్తు చేశారు. యజమానులకు ముందుచూపు లేకపోవడం, అనుభవం లేని కార్మికులను పనిలో పెట్టుకోవడం ద్వారా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రమాదాలు జరిగితే యజమానులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో శ్రీధర్ రావు, వెంకటేష్, మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో హోంగార్డ్ ఆత్మహత్య



నవతెలంగాణ-సంగారెడ్డి

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్న సంఘటన సంగారెడ్డిలో చోటు చేసుకుంది. సీఐ శ్రీధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... అస్తబల్‌కు చెందిన హోంగార్డ్ కొంకి హనుమంతరావు(40) సిద్దిపేటలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. భార్యా పిల్లలు అనారోగ్యానికి గురైతే వారి చికిత్స కోసం అప్పు చేశాడు. ఆ అప్పులు తీర్చలేని స్థితిలో హనుమంతరావు ఆవేదనకు గురయ్యాడు. సోమవారం డ్యూటీకి వెళుతున్నానని చెప్పి ఉదయం 5.30 గంటలకు బయలు దేరాడు. మధ్యాహ్నం 12 గంటలకు రేకుల ఇంట్లో ఇరుప రాడ్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- గ్రామ పంచాయతీ కార్మిక సంఘం(సీఐటీయూ) జిల్లా కార్యదర్శి ఆసిఫ్



నవతెలంగాణ-తూప్రాన్,రూరల్‌మనోహరాబాద్

గత రెండు నెలలుగా గ్రామ పంచాయతీ సఫాయి కార్మికులు వేతనాలు లేక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని సీపీఐటీయూ గ్రామ పంచాయతీ కార్మిక సంఘం(సీఐటీయూ) జిల్లా కార్యదర్శి ఆసిఫ్ డిమాండ్ చేశారు. సోమవారం మనోహరాబాద్ మండలంలోని కార్మికులతో కలిసి భిక్షాటన చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వేతనాలు చెల్లించకపోవడంతో కుటుంబాలు గడవలేని పరిస్థితిలో ఉన్నారని తెలిపారు. అధికారులు స్పందించి వెంటనే గ్రామపంచాయతీ సఫాయి కార్మికుల వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. మండలంలోని గ్రామ పంచాయతీల కార్మికులు పాల్గొన్నారు.



ఎల్లలు దాటేలా ఏడుపాయల జాతర ఏర్పాట్లు చేయాలి: కలెక్టర్ రాజర్షిషా

నవతెలంగాణ మెదక్ రూరల్

ఎల్లలు దాటేలా ఏడుపాయల జాతర ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాజర్షిషా అధికారులకు సూచించారు. ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు మూడు రోజుల పాటు వైభవోపేతంగా నిర్వహించనున్న ఏడుపాయల జాతర ఏర్పాట్లపై సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా అధికారులతో ఎస్పీ రోహిణి ప్రియదర్శిని, అదనపు కలెక్టర్లు ప్రతిమాసింగ్, రమేష్‌లతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని భక్తులకు ఎలాంటి లోటుపాట్లు కలుగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ పిన్ పాయింట్‌వారీగా రోజువారీ షిఫ్ట్ ప్రకారం సిబ్బందికి విధులు కేటాయించి, పాసులు జారీ చేయాలన్నారు. ఫోర్ వీలర్, ద్విచక్ర వాహన పాసుల జారీ, పార్కింగ్ హేతుబద్దీకరించడం వల్ల జాతరలో చాలా సమస్యలను అధిగమించొచ్చన్నారు. ఈసారి జాతరకు భారీగా నిధులు వచ్చినందున శౌచాలయాలు, బట్టలు మార్చుకునే గదులు, తదితర శాశ్వత నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. బారీకేడింగ్ 16 నాటికి పూర్తి చేసి ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నారు. 600 మంది పారిశుద్య కార్మికులను నియమించుకోవాలని తెలిపారు. షవర్లు, మంచినీటి కుళాయిలు, శౌచాలయాలు అన్ని వినియోగంలో ఉండేలా చూడాలన్నారు. విద్యుత్ అంతరాయం కలగకుండా చూడాలన్నారు. వైఫైజోన్లు



పెంచాలన్నారు. జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి బస్సులు నడపాలన్నారు. గజ ఈతగాళ్లు, వైద్య ఆరోగ్య కేంద్రాల ఏర్పాటు చేయాలని సూచించారు. ఎస్పీ రోహిణి ప్రియదర్శిని మాట్లాడుతూ 16 నాటికి ఏర్పాట్లన్నీ పూర్తయితే 17న పోలీస్ సిబ్బందికి బ్రీఫింగ్ ఇస్తామన్నారు. గత జాతరలో తలెత్తిన పార్కింగ్ ఇబ్బందులను అధిగమించడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డిఎస్పీ సైదులు, జిల్లా పరిషద్ సీఈఓ శైలేష్, నీటిపారుదల ఎస్ ఈ యేసయ్య, ఆర్.డి.ఓ. సాయిరాం, ఏ.డి. మైన్స్ జయరాజ్, తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ ఫామ్ మొక్కలు నాటాలి: కలెక్టర్

నవ తెలంగాణ-కొండపాక



జిల్లాలోని అన్ని మండలాల వారిగా ఫిబ్రవరి మాసానికి నిర్దేశించిన విధంగా ఆయిల్ ఫామ్ మొక్కలను నాటేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ వ్యవసాయ అధికారులను టెలికాన్ఫరెన్స్ ద్వారా ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ జిల్లాలోని అన్ని మండలాల వ్యవసాయ అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో ఆయిల్ ఫామ్ తోటల పెంపకం పై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆయిల్ ఫామ్ విస్తరణ కార్యక్రమంలో భాగంగా ఇప్పటివరకు జిల్లాలో 8000 ఎకరాలలో సాగు జరుగుతోందని అదేవిధంగా ఫిబ్రవరి నెలలో జిల్లాకు 2217 ఎకరాల లక్ష్యాన్ని 23 మండలాల వ్యవసాయ అధికారులకు మండలాల వారిగా టార్గెట్ ఇవ్వడం జరిగిందని ఇందుకుగాను ఇప్పటివరకు 410 ఎకరాలకు రైతులను గుర్తించి రైతు వాటా చెల్లించడం జరిగినదని అదేవిధంగా క్లస్టర్ల వారీగా వ్యవసాయ విస్తరణ అధికారులతో సమీక్షలు నిర్వహించి కొత్త రైతులను గుర్తించి త్వరితగతిన ఫిబ్రవరి మాసం లక్ష్యాన్ని చేదించాలని జిల్లా కలెక్టర్ మండల వ్యవసాయ అధికారులను ఆదేశించారు. టెలికాన్ఫరెన్స్ లో జిల్లా వ్యవసాయ అధికారి శివ ప్రసాద్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి రామలక్ష్మి, వ్యవసాయ సహాయ సంచాలకులు, ఉద్యాన అధికారులు మరియు టీఎస్ ఆయిల్ ఫెడ్ అధికారులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఇండ్లు ఇస్తారా.. ఆక్రమించమంటారా

- సీపీఐ(ఎం) సంగారెడ్డి జిల్లా కార్యదర్శి జి.జయరాజు



నవతెలంగాణ-సంగారెడ్డి

'రాజీవ్ గృహకల్ప లబ్దిదారులకు ఇల్లు ఇస్తారా లేదా ఆక్రమించమంటారా సీపీఐ(ఎం) సంగారెడ్డి జిల్లా కార్యదర్శి జి.జయరాజు అన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని కోరుతూ సోమవారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ 2009లో రాజీవ్ గృహకల్ప ఇండ్ల కోసం 216 మంది లబ్దిదారులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. అప్పులు చేసి, బంగారం తాకట్టు పెట్టి రూ.49 వేలు రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లించారని తెలిపారు. నేటి వరకూ లబ్దిదారులకు మాత్రం రాజీవ్ గృహకల్ప ఇండ్లు మంజూరు చేయకపోవడం చాలా దారుణమన్నారు. పెరుగుతున్న ధరలతో ఇంటి అద్దెలు, పిల్లల స్కూలు ఫీజులు కట్టలేక లబ్దిదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్య పరిష్కారం కోసం పోరాటం నిర్వహిస్తామని హెచ్చరించారు. ఇండ్ల స్థలాలు అడుగుతే ప్రభుత్వం ఇప్పటివరకు స్పందించకపోవడం చాలా దారుణమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి పేదలందరికీ ఇళ్లస్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సీపీఐ(ఎం) సంగారెడ్డి ఏరియా కార్యదర్శి యాదగిరి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత లబ్దిదారులను పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం రాజీ గృహకల్ప లబ్దిదారులకు ఇండ్లు మంజూరు చేసి ఆ కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి లబ్దిదారులకు న్యాయం చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు షబ్బీర్, బాలరాజు, మల్లేశం, లబ్దిదారులు రాము పంతులు, శాంతమ్మ, మల్లమ్మ, షబీనా తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ మార్ట్‌పై చర్య తీసుకోవాలి

- నాసిరకం సరకులు అమ్ముతున్నారని జాయింట్ కలెక్టర్‌కు సీపీఎం నేతల ఫిర్యాదు







నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి పట్టణంలో నాసిరకం సరకులు అమ్ముతూ వినియోగదారులను మోసం చేస్తున్నారని, పురుగులున్న కర్జూరం పండ్లను అమ్మి డబ్బులు దండుకుంటున్నారని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.అడివయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అతిమేల మాణిక్ ఆరోపించారు. సోమవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డికి సీపీఐ(ఎం) నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని నేషనల్ మార్ట్‌లో ఈ నెల 11న నిత్యావసర సరుకుల కొనుగోలు చేశారని తెలిపారు. ఇంటికి వెళ్లిన తరువాత కర్జూరం పండ్లను ఓపెన్ చేయగా పురుగులు ఉన్నట్లు గమనించామన్నారు. నాణ్యమైన సరుకులు అమ్ముతున్నామని ప్రచారం చేస్తూ వినియోగదారులను మోసం చేస్తున్నారన్నారు. లాభార్జనే తప్ప వినియోగదారుల గురించి ఎందుకు ఆలోచించడం లేదని ప్రశ్నించారు. దుకాణాల్లో సరకుల నాణ్యతను పరిశీలించాల్సిన ఆహార భద్రత తనిఖీ అధికారులు, మున్సిపాలిటీ హెల్త్ ఇన్స్పెక్టర్ పట్టించుకోవడం లేదన్నారు. అధికారుల నిర్లక్ష్యం వినియోగదారుల పాలిట శాపంగా మారుతోందన్నారు. ఫుడ్ ఇన్స్పెక్టర్‌కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. చిన్న పిల్లలు తినే డ్రై ఫ్రూట్స్ ఇంత నాసిరకంగా, పురుగులు పట్టిన వాటిని అమ్మడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. నేషనల్ మార్ట్‌లో అమ్ముతున్న అన్ని రకాల సరకులను నాణ్యత పరీక్షలు చేయాలన్నారు. యాజమాన్యాల నిర్లక్షంతో వినియోగదారులు అనారోగ్యాల పాలవుతున్నారని అన్నారు. నేషనల్ మార్ట్‌తో పాటు పట్టణంలోని అనేక దుకాణాల్లో నాసిరకం సరకులు అమ్ముతున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు.

విచారణ చేయిస్తాం: అడిషనల్ కలెక్టర్

నేషనల్ మార్ట్‌లో నాసిరకం సరుకులు అమ్ముతూ... కర్జురాల్లో పురుగులు వచ్చిన ఘటనపై ఫుడ్ ఇన్స్పెక్టర్తో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డి హామీ ఇచ్చారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని ఆయన చెప్పారు. దుకాణాల్లో నాణ్యమైన సరుకులు విక్రయించాలని సూచించారు.

బొల్లారం, బొంతపల్లి పారిశ్రామిక వాడల్లో ఫైర్‌స్టేషన్లు ఏర్పాటు చేయాలి

- కలెక్టరేట్ ఏవోకు సీఐటీయూ నాయకుల వినతి



నవతెలంగాణ-సంగారెడ్డి

బొల్లారం, బొంతపల్లి పారిశ్రామిక వాడల్లో ఫైర్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కె.రాజయ్య కోరారు. సోమవారం సీఐటీయూ నాయకులు కలెక్టరేట్‌లో ఏవోకు వినతి పత్రం అందజేశారు. అనంతరం రాజయ్య మాట్లాడుతూ దేశంలోనే పెద్ద పారిశ్రామిక వాడలుగా వున్న బొల్లారం, కాజిపల్లి, బొంతపల్లిలలో ఫైర్ స్టేషన్లు లేకపోవడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వాలు పరిశ్రమలను నెలకొల్పిన తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం విచారకరమన్నారు. బొల్లారం, బొంతపల్లి కాజేపల్లిలో వందలాది పరిశ్రమలు ఉన్నాయన్నారు, 50 వేల మంది కార్మికులు ఇక్కడ పని చేస్తున్నారని తెలిపారు. ప్రతి నెలలో అనేక పరిశ్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఈ ప్రమాదాల్లో కార్మికుల ప్రాణాలు పోతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఫైర్‌స్టేషన్లు లేకపోవడం ఫలితంగా ప్రాణనష్టం, ఆస్తి నష్టం తీవ్రంగా ఉందన్నారు. అగ్ని ప్రమాదాలు జరిగితే పటాన్చెరు, జీడిమెట్ల, నర్సాపూర్ నుంచి ఫైర్ ఇంజన్లు రావాల్సి వస్తుందన్నారు. అవి వచ్చేలోపే కాలిబూడిదగా మారుతున్నాయని అన్నారు. ఈ నెల రోజుల్లోనే మైలాన్‌లో ప్రమాదం జరిగి ముగ్గురు మృతి చెందారన్నారు. కేకులేలో గతంలో ప్రమాదం జరిగే ముగ్గురు మృతి చెందారన్నారు. లిఫారంలో అగ్నిప్రమాదం జరిగే ఒకరు గాయాలపాలయ్యారని తెలిపారు. అనేక పరిశ్రమల్లో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వేసవి కాలంలో మరింత ప్రమాదాలు పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ ప్రాంతంలో కెమికల్ పరిశ్రమలు ఉన్నందున అగ్ని ప్రమాదాలు జరగడానికి అవకాశం ఉందన్నారు. అందుకే తక్షణమే ఫైర్ స్టేషన్లు బొల్లారం, బొంతపల్లిలలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ఈ సందర్భంగా రాజయ్య హెచ్చరించారు. కార్యక్రమంలో మండల నాయకులు శ్రీధర్ రావు, మధుసూదన్ రెడ్డి, వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేను ప్రేమిస్తున్నా..

నేను భూమిపై పడకముందే..
నన్ను ప్రేమించిన నను
కన్నోళ్ళనూ..
నాకై నా తల్లిలో పాలను నింపిన
భగవంతున్నీ..
విద్యాబుద్దులు నేర్పిన
గురువులనూ..
నా ఉన్నతి మూలమైన
స్నేహితులనూ..
తాళి బంధంతో సర్వం
నేనేనన్న ఆలినీ..
ఎల్లవేళలా ఆనందం పంచే నే
కన్నోళ్లనూ..
అనుక్షణం వెన్నుదన్నుగా
నిలిచిన బంధుగణాన్నీ..
స్వేచ్ఛావాయువుకు కారకులైన
నాటి-నేటి త్యాగధనులనూ..
భగవత్ స్వరూపులైన దీనులనూ-
ఆర్తులనూ..
పంచభూతాలనూ..
కంచంలో అన్నాన్నీ.. పండించిన
రైతునూ..
నా వృత్తినీ-ప్రవృత్తినీ..
నిన్నూ, నిన్నూ, నిన్నూ..
ఈ చరాచరా సమస్త
విశ్వాన్నీ..
నేను ప్రేమిస్తున్నా...



- బళ్లారి శ్రీనివాసచారి
జోగిపేట, జి:సంగారెడ్డి
9441560672

సీతయ్య ఎవరి మాటా వినడు

- మున్సిపల్ చైర్మన్ ఒంటెత్తు పోకడలు
- అవిశ్వాస తీర్మానం కోసం కౌన్సిలర్ల వినతి

నవ తెలంగాణ- గజ్వేల్


సీతయ్య ఎవరి మాటా వినడు... ఈ మాటలు ఇప్పుడు గజ్వేల్ మున్సిపల్‌లో హాట్ టాపిక్‌గా మారింది. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ నేతి చిన్న రాజమౌళి ఎవరి మాటా వినడం లేదని కౌన్సిల్ సభ్యులు అంటున్నారు. సొంత నిర్ణయాలు తీసుకోవద్దని మూడు సంవత్సరాలుగా అనేకసార్లు చెప్పినా సీతయ్య ఎవరి మాట వినరు అనే సినిమా డైలాగ్‌లా మున్సిపల్ చైర్మన్ తీరు మారిందని పేర్కొంటున్నారు. దీంతో అవిశ్వాసం పెట్టాలని కలెక్టర్కు వినపత్రం అందజేశామని 14 మంది కౌన్సిల్ సభ్యులు పేర్కొంటున్నారు. మున్సిపల్ చైర్మన్ మినహాయిస్తే మిగతా ఐదుగురు సభ్యులు అవిశ్వాసానికి దూరంగా ఉన్నా ఆయనపై గుస్సాగానే ఉన్నారు. ఆయన తీరు మారడం లేదని, వ్యక్తిగత సమస్యలతో తాము అవిశ్వాసానికి వెళ్లలేకపోయినట్లు పేర్కొంటున్నారు. 19 మంది చైర్మన్‌పై అసంతృప్తిగా ఉన్నారు. ఇందులో 14 మంది బహిర్గతంగా విమర్శలకు దిగి అవిశ్వాసం పత్రాన్ని అధికారులకు అందజేశారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పట్టణానికి కోట్లాది రూపాయల అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి కేసీఆర్ మంజూరు చేస్తున్నా ఎందుకు అసంతృప్తి నెలకొన్నదని ఆరా తీస్తే అనేక విషయాలు వెలుగు చూస్తున్నాయి.

గత ఎన్నికల్లో అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొని విజయం సాధించాలని కౌన్సిలర్లు పేర్కొంటున్నారు. నామినేషన్ పనుల కోసం అనేకసార్లు చైర్మన్ దృష్టికి తీసుకపోయినా టెండర్ పద్ధతిలోనే పనులు చేయాలని కరాఖండిగా చెప్పారని వాపోతున్నారు. పార్టీ అధిష్టానం సైతం నామినేషన్ వర్క్‌కు ఒప్పుకోకపోవడం కూడా అవిశ్వాసానికి దారి తీసినట్లు పేర్కొంది. రూ.99 కోట్లతో అండర్ డ్రైనేజీ పనులు చివరి దశకు వచ్చాయి. ఈ పనులను అయ్యప్ప కన్స్ట్రక్షన్‌కు అప్పగించారు. మున్సిపల్ నిధులతో చేపట్టే పనులు సైతం టెండర్ల రూపంలోనే చేయాలని పట్టుబట్టడంతో మున్సిపల్ చైర్మన్‌పై వ్యతిరేకత పెరుగుతోంది. చాలా చోట్ల మున్సిపల్ నిధులు, ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులతో నామినేషన్ పనులు చేయిస్తున్నారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్‌లో మాత్రం నామినేషన్ పనులు చేయడం లేదు. ఈ విషయమై రాష్ట్ర ఆర్థిక ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు దృష్టికి తీసుకుపోయినా పరిష్కారం కాకపోవడంతో కౌన్సిల్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బిల్లుల ఆమోదంలో ఉదయం 11 గంటలకు ప్రారంభమైన సాధారణ సమావేశాలు ఒక్కో రోజు రాత్రి రెండు గంగల వరకు కౌన్సిల్ సభ్యులను బుజ్జగించి సంతకాలు చేయించుకున్నారు. పలుమార్లు మంత్రి హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, ఎఫ్‌డీఎస్ చైర్మన్ వంటే ప్రతాప్ రెడ్డి దృష్టికి తీసుకుపోయారు. అయినా కౌన్సిల్ సభ్యుల మాటను ఎవ్వరూ వినలేదు. సీఎం కేసీఆర్ నియోజకవర్గ అయినందున ప్రతి పని టెండర్ రూపంలో చేయాలని అధికారులు సైతం అంటున్నారు. ఇరిగేషన్ అధికారిగా పనిచేసిన అనుభవం మున్సిపల్ చైర్మన్‌కు ఉండడంతో పనులు నాణ్యతగా జరగాలంటే టెండర్లు రూపంలో జరగాలనేది ఆయన వాదన. ఈ విషయం కౌన్సిల్ సభ్యులకు కొంత ఇబ్బందిగా మారింది. అవిశ్వాసం వెనుక అసలు కథ ఇదేనని కౌన్సిల్ సభ్యులు పేర్కొంటున్నారు. మున్సిపల్ చైర్మన్ సమావేశ ఎజెండా గంట ముందు చెబుతున్నారని కౌన్సిల్ సభ్యులు వాదిస్తున్నారు. సాధారణ సమావేశం ఎజెండాను ఒకరోజు ముందే కౌన్సిల్ సభ్యుల ఇంటికి పంపాలనేది చట్టంలో ఉన్నప్పటికీ ఇక్కడ మాత్రం అమలు కావడం లేదని సభ్యులు మండిపడుతున్నారు. గజ్వేల్ మున్సిపల్ చైర్మన్ నేతి చిన్న రాజమౌళి తీరు చూస్తే సీతయ్యగా మారినట్లు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు గజ్వేల్ పట్టణంలో చర్చించుకుంటున్నారు.





నవతెలంగాణ 2
సంగారెడ్డి
మంగళవారం 14 ఫిబ్రవరి 2023



ఉపాధి పనుల్లో వేగం పెంచాలి

ఎంపీడీఓ వెంకట్ రెడ్డి



నవతెలంగాణ-న్యాల్‌కల్

మండలంలోని న్యామతాబాద్ గ్రామపంచాయతీలో ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ వెంకట్‌రెడ్డి పరిశీలించారు. పనులు కల్పించడంలో కూలీల సంఖ్య పెంచాలని పంచా యతీ కార్యదర్శు లకు ఆయన సూచించారు. ఇప్పటివరకు అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు ప్రారంభమయ్యాయి. వేసవిలో వలస నివారణకు ఉపాధి హామీ పని కల్పించడం జరిగిందన్నారు. అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు ఉపయోగించేలా పంచాయతీ సెక్రెటరీలు దృష్టి సారించాలన్నారు. కూలీలకు త్రాగునీరు, మెడికల్ కిడ్స్ అందుబాటులో ఉంచాలన్నారు. ఉపాధి హామీ పనుల కోసం జాబ్ కార్డ్ లేని వారు గ్రామ పంచాయతీలో సర్పంచ్, సెక్రటరీ లను సంప్రదించాలని ఎంపీడీవో వెంకట్ రెడ్డి కోరారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

సరికొత్త పద్ధతుల్లో విద్యాబోధన



నవతెలంగాణ-అమీన్‌పూర్

విద్యార్థులకు సంప్రదాయ పద్ధతులే కాకుండా సరికొత్త పద్ధతుల్లో విద్యాబోధన అందిస్తున్నామని స్ప్రింగ్ బోర్డ్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రతినిధులు అన్నారు. సోమవారం వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను వారు నిర్వహించారు. బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ సుధాకర్ రెడ్డి, జయప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ సాంస్కృతిక పద్ధతులకు భిన్నంగా బోధనను అలవర్చుకోవాలని, చిన్నారులకు అవగాహన కల్పిస్తున్నట్లు వారు తెలిపారు. శాస్త్రీయ పద్ధతులను నేర్పుతున్నట్లు, వాటితోపాటు అనేక సాంస్కృతిక, స్పోర్ట్స్, విభాగాల్లో విద్యార్థులను ముందంజలో ఉంచేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఉత్తమ విద్యా బోధన తోపాటు, ఉత్తమ ఫలితాలను అందిస్తున్నామని వారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రసన్న రెడ్డి, రాధారెడ్డి, ఉపాధ్యాయులు, పేరెంట్స్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఖేడ్‌లో ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేయాలి

ఎన్‌బీఆర్ ప్రెసిడెంట్ అబ్దుల్ సాజిద్



నవతెలంగాణ-నారాయణఖేడ్

నారాయణఖేడ్‌లో త్వరితగతిన ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేయాలని ఎన్‌బీఆర్ ప్రెసిడెంట్ అబ్దుల్ సాజిద్ కోరారు. ఇటీవల జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో నారాయణఖేడ్ షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ క్రీడాకారులు ద్వితీయ, తృతీయ బహుమతులను సాధించారన్నారు. నారాయణఖేడ్‌లో ఇండోర్ స్టేడియం లేకున్నా క్రీడాకారులు ఎంతో చక్కగా ప్రతిభ కనపరచి విజయాలు సాధించారన్నారు. క్రీడాకారులను అసోసియేషన్ బృందం సభ్యులు ప్రత్యేకంగా అభినందించారు.

కౌన్సిల్ విప్ రాజుకు ఘన సన్మానం



నవతెలంగాణ-జిన్నారం

తెలంగాణ శాసనమండలి విప్‌గా నియామకమైన ఎమ్మెల్సీ శంబిపూర్ రాజును సోమవారం బీఆర్ఎస్ నాయకుడు జిన్నారం వెంకటేశం గౌడ్ ఘనంగా సన్మానించారు. ఈ మేరకు ఆయన పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించగా, శంబిపూర్ రాజు వెంకటేశం గౌడ్‌ను ఆత్మీయంగా పలకరించారు. ఈ కార్యక్రమంలో జిన్నారం మండల పార్టీ అధ్యక్షుడు రాజేష్ బృందం పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా హనుమాన్ విగ్ర ప్రతిష్ఠోత్సవం

హాజరైన కేంద్ర ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాస్ గౌడ్.



నవతెలంగాణ-కల్హేర్

నారాయణఖేడ్ నియోజకవర్గం సిర్గాపూర్ మండల పరిధిలోని కడ్పల్ గ్రామంలో శ్రీ హనుమాన్ దేవాలయ పునర్ ప్రతిష్టా కార్యక్రమానికి కేంద్ర ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్ వి.శ్రీనివాస్ గౌడ్ హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ కడ్పల్ గ్రామ ప్రజలు చాలా అదృష్టవంతులని, గ్రామంలోని మహిళలందరూ ఏకతాటిపైకి వచ్చి ఆలయ పునర్ నిర్మాణం కావించడం, తమను ఆహ్వానించడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ బాధ్యులు శ్రీనివాస్ గౌడ్‌కు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బహుజన సమాజ్ వాజ్ పార్టీ నారాయణఖేడ్ ఇన్చార్జ్ పండరి. స్థానిక సర్పంచ్ రాజు పటేల్, పెద్ద శంకరంపేట వైస్ ఎంపీపీ లక్ష్మీ రమేష్. విట్టల్ రెడ్డి, వెంకాగౌడ్, రాఘవరెడ్డి, సురేష్ గౌడ్, భూమయ్య, చేనేత సహకార సంఘం మాజీ చైర్మన్ మహంకాళి కృష్ణమూర్తి, ఇస్మాయిల్ రవి, జిన్న అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్‌కు చిరునామా టీవైఆర్ ఫౌండేషన్



నవతెలంగాణ-గజ్వేల్

కెరీర్ గైడెన్స్‌కు చిరునామా టీవైఆర్ ఫౌండేషన్ అని ఫౌండేషన్ చైర్మెన్ రాజు తెలిపారు. సంస్థ కరపత్రం ఆవిష్కరణ సందర్బంగా ఆయన పాల్గొని మాట్లాడుతూ ఆధునిక సౌకర్యాలతో ఫిజికల్ , వర్చువల్ గ్రంధాలయము, విజ్ఞాన కేంద్రము అన్ని పోటీ పరీక్షలకు సంబంధించిన ఫౌండేషన్ కోర్సు కోచింగ్ సెంటర్ ను అతి త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. నేటి కంప్యూటర్ యుగంలో గొప్ప అవకాశాలతో పాటు సవాళ్ళను తీసుకొస్తుందన్నారు. ఎక్కడెక్కడో ఉన్న విషయాలను తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు..

అదాని స్టాక్స్ కుంభకోణంపై విచారణ జరిపించాలి

ఎస్బీఐ బ్యాంక్ ఎదుట సీపీఐ ధర్నా



నవతెలంగాణ-చేర్యాల

అదాని స్టాక్స్ కుంభకోణంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ చేత విచారణ జరిపించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్ డిమాండ్ చేశారు. కుంభకోణంపై విచారణ జరిపించాలని కోరుతూ సోమవారం మండల కేంద్రంలోని ఎస్బీఐ బ్యాంక్ ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం బ్యాంక్ మేనేజర్ రాంబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ అదాని స్టాక్స్ కుంభకోణంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ చేత విచారణ జరిపించి కుంభకోణాన్ని వెలికి తీసి ఆ డబ్బును పేద ప్రజలకు పంపిణీ చేసి, బ్యాంకుల్లో అప్పులు తీసుకున్న రైతులందరికీ రుణమాఫీ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా సమితి సభ్యులు ఈరి భూమయ్య, మండల సహాయ కార్యదర్శి బండారి సిద్ధయ్య, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు గూడెపు సుదర్శన్, మహిళా సమాఖ్య జిల్లా నాయకురాలు పొన్నబోయిన మమత, ఈరి సత్యవ్వ, ముస్త్యాల శంకరయ్య, ఎండీ. షాదుల్ల, శెట్టె అయిలయ్య,పల్లా సీతారామయ్య, ఇరుమల్ల రాజు, కె. నర్సయ్య, బట్ రాజు, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధే లక్ష్యంగా ముందుకు

అంగడికిష్టాపూర్ సర్పంచ్ దుద్దెడ లక్ష్మీ రాములు గౌడ్



నవతెలంగాణ-మర్కుక్

గ్రామాభివృద్ధే లక్ష్యంగా తాము ముందుకు వెళ న్నామని అంగడి కిష్టాపూర్ సర్పంచ్ లక్ష్మీ రాములుగౌడ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని అంగడి కిష్టాపూర్ గ్రామంలో రూ.10 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్డు పనులను ఎంపీటీసీ గోలి నరేందర్, ఉపసర్పంచ్ కొండల్ రెడ్డిలు ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాన్ని అన్నివిధా లా అభివృద్ధి చేయడానికి నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. నిరంతరం ప్రజల్లో ఉండి వారి సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారం కోసం పనిచేస్తున్నామన్నారు. గ్రామంలో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. గ్రామస్తుల సహకారంతో గ్రామాన్ని అన్నిరంగాల్లో ముందుకు తీసుకెళ్తామన్నారు. దీనికి అందరూ సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కుమ్మరి కనకయ్య, శ్రీనివాస్ రెడ్డి, యశోద, గీత, సరిత, నాయకులు గ్రామ బీఆర్ఎస్ గ్రామాధ్యక్షులు బాల్ రెడ్డి, ఉపాధ్యక్షులు వెంకటేష్, మీసాల శ్రీనివాస్ రెడ్డి, రాముగౌడ్, సుదర్శన్ గౌడ్, కంది నర్సింహా చారి, ఆంజనేయులు, నాగరాజు వెంకటేష్, గ్రామస్తులు తదితరులున్నారు.

స్ఫూర్తి ప్రధాత చత్రపతి శివాజీ

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

నవతెలంగాణ-జిన్నారం

మరాఠా యోధుడు చత్రపతి శివాజీ గొప్ప స్పూర్తి ప్రదాత అని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. జిన్నారం మండలం పెద్దమ్మ గూడెం శివారులో రూ.9 లక్షల సొంత నిధులతో ఏర్పాటుచేసిన చత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆదివారం రాత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ ప్రజా సంక్షేమం కోసం అవలంబించిన పరిపాలన విధానాలు నేటి తరానికి దిక్సూచికలన్నారు. చత్రపతి శివాజీ మహారాజ్ ప్రజల సంక్షేమంకై ఆదర్శవంతమైన పథకాలను ప్రవేశపెట్టిన మహనీయుడని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుర్తు చేశారు. గొప్పనైన లక్ష్యం, వీరత్వంతో యువతరానికి ఆదర్శమూర్తిగా నిలిచిన చరిత్ర పురుషుడు శివాజీ మహారాజని ఎమ్మెల్యే జీఎంఆర్ కొనియాడారు.

బైక్ ర్యాలీతో ఎమ్మెల్యేకు ఆహ్వానం

శివాజీ విగ్రహ ఆవిష్కరణకు విచ్చేసిన ఎమ్మెల్యే జీఎంఆర్‌కు స్థానిక యువత బైక్ ర్యాలీ నిర్వహించి ఆహ్వానం పలికారు. భారీ స్థాయిలో టీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు జిన్నారం వెంకటేశం గౌడ్ బృందం ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మెన్ కుంచాల ప్రభాకర్, బీఆర్ఎస్ రాష్ట్ర నేత జిన్నారం వెంకటేశం గౌడ్, స్థానిక సర్పంచ్ అంత రెడ్డిగారి లావణ్య శ్రీనివాస్ రెడ్డి, ఉప సర్పంచ్ నీలం సంజీవ, ఎంపీటీసీ కోరబోయిన లావణ్య నరేష్, జిన్నారం గ్రామపంచాయతీ



పాలకవర్గం, ఛత్రపతి శివాజీ అధ్యక్షులు, సత్యనారాయణ, వార్డు సభ్యులు శ్రీనివాస్ యాదవ్, ఆత్మ కమిటీ డైరెక్టర్ దుబ్బాక మహేష్ యాదవ్, లింగం, గడ్డపోతారం సర్పంచ్ ప్రకాశం చారి, కార్పొరేటర్ బూరుగడ్డ పుష్ప నగేష్, యాదవ్,



జిన్నారం సిఐ వేణు కుమార్, ఎస్సై విజయ్ కృష్ణ మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డి, ఛత్రపతి శివాజీ యూత్ సభ్యులు, వివిధ నాయకులు, ఆయా పార్టీల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు శివాజీ మహారాజ్ విగ్రహాన్ని పటాన్‌చెరు నియోజకవర్గానికి చెందిన వేర్వేరు పార్టీల నాయకులు సందర్శించారు. సందర్శించిన వారిలో మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్ గౌడ్, బీజేపీ నేత గోదావరి అంజిరెడ్డి, వి.ప్రతాప్ రెడ్డి బృందం తదితరులు ఉన్నారు.

ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

నవతెలంగాణ-రామచంద్రాపురం

కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పటాన్‌చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి విద్యార్థులకు విజ్ఞప్తి చేశారు. రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని శ్రీ గీతా భూపాల్ రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవ వేడుకలను సోమవారం కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర శాసనమండలి మాజీ చైర్మన్ భూపాల్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే జీఎంఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పటాన్‌చెరు ప్రాంతంలోని నిరుపేద విద్యార్థిని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్న లక్ష్యంతో 17 సంవత్సరాల క్రితం అప్పటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి సహాయ సహకారాలతో భూపాల్ రెడ్డి ఈ కళాశాలను ప్రారంభించారన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల అయినప్పటికిని కళాశాల అభివృద్ధికి అనునిత్యం అండగా నిలుస్తూ విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడంలో భూపాల్ రెడ్డి పాత్ర ప్రశంసనీయమన్నారు. ప్రభుత్వం ప్రభుత్వ విద్యాసంస్థల బలోపేతానికి కోట్ల రూపాయల నిధులు ఖర్చు చేస్తుందని, కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా అన్ని మౌలిక వసతులు కల్పిస్తుందన్నారు. శ్రద్ధసక్తులతో చదివి తల్లిదండ్రులకు, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకుని రావాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కళాశాల విద్యార్థినీ విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతి కార్యక్రమాలు అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ ఎంపీపీ దేవానందం, జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి రామచంద్రపురం కార్పొరేటర్ పుష్ప నగేష్, భారతి నగర్ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ అంజయ్య, సీనియర్ నాయకులు సోమిరెడ్డి, పరమేష్, కుమార్ గౌడ్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలి

- ఎంపీడీవో సుమతి



నవతెలంగాణ-జహీరాబాద్

ప్రతి ఒక్కరు కంటి పరీక్షలు చేయించుకోవాలని కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో సుమతి తెలిపారు. మండలంలోని గోవింద్‌పూర్ గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలో కంటి వెలుగు శిబిరాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరు తమ కళ్ళను పరీక్షలు చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు. గ్రామంలోని ప్రజలందరి కంటి పరీక్షలు అయ్యేంతవరకు వైద్య సిబ్బంది గ్రామంలోనే ఉంటారన్నారు. రెండో విడత కంటి వెలుగులో వైద్య పరీక్షలతోపాటు అవసరమున్న వారికి కంటి అద్దాలు, మందులను కూడా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఎవరికైనా రెటీనా సమస్య ఉంటే వారికి హైదరాబాద్ తీసుకవెళ్లి శస్త్ర చికిత్స కూడా ప్రభుత్వమే చేయిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాజు, కంటి వెలుగు డాక్టర్ సౌమ్యరాణి, సూపర్వైజర్, మారియా, పంచాయతీ కార్యదర్శి దత్తు రెడ్డిలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కంటి వెలుగు



నవతెలంగాణ-న్యాల్ కల్

మండలంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కంటి వెలుగు కార్యక్రమాన్ని 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని చాల్కి సర్పంచ్ కవిత చంద్రశేఖర్ రెడ్డి కోరారు. చాల్కి గ్రామంలో కొనసాగుతున్న కంటి వెలుగును పేద ప్రజల ఆరోగ్యం బాగు కోసమే ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కంటి చూపు లేని వారికి చక్కటి అవకాశమన్నారు. చాల్కి లో ఇప్పటివరకు 1220 మందికి కంటి పరీక్షలు చేసినట్లు 35 మందికి కంటి అద్దాలు ఇచ్చినట్లు తెలిపారు. ఈ నెల 15 తేది వరకు కొనసాగుతుందని ఆసుపత్రి వైద్యులు శ్వేత ప్రియ తెలిపారు.

రామతీర్థంలో..

మండలంలో రామతీర్థం గ్రామంలో 820 మందికి కంటి పరీక్షలు చేయడం జరిగిందని వెలుగు పోగ్రామ్ ఆఫీసర్ శ్రీదేవి పంచాయతి కార్యదర్శి కృష్ణ ప్రతాప్ రెడ్డి తెలిపారు. 152 మందికి కంటి అద్దాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు.



నవతెలంగాణ-తొగుట

కంటి వెలుగు కార్యక్రమంతో కంటి సమస్యలు పరిస్కారం అవుతున్నాయని తహశీల్దార్ మహమ్మద్ జహీర్ అన్నారు. కొద్దిరోజుల క్రితం కంటి వెలుగు కార్యక్రమంలో పరీలు చేయించుకున్న వారికి సోమవారం అద్దాలను హెల్త్ సూపర్వైజర్ స్వామి, ఏఎస్ఎంలతో కలిసి అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది అంబదాస్, తార ఉన్నారు.

దేశానికి వెన్నెముక యువత

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి
రూ.20 లక్షల సొంత నిధులతో యువజన భవన నిర్మాణాలు
ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

నవతెలంగాణ-అమీన్‌పూర్

యువకులే దేశానికి వెన్నెముక అని పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ప్రస్తుత రాజకీయాల్లో యువత భాగస్వామ్యం పెరగాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని 10వ వార్డు సాయి కాలనీలో రూ.20 లక్షల సొంత నిధులతో నిర్మించ తలపెట్టిన యువజన భవన నిర్మాణ పనులకు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య సంగ్రామం నుంచి మొదలుపెడితే ప్రత్యేక తెలంగాణ ఉద్యమం వరకు యువకులే కీలక పాత్ర పోషించారన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో యువజన సంక్షేమానికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించడంతోపాటు, స్వయం ఉపాధి రంగానికి ఊతమిచ్చేలా పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు. ప్రధానంగా ఐటీ రంగంలో పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు సృష్టించి, ఆర్థిక అభ్యున్నతికి తోడ్పాటు అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, స్థానిక కౌన్సిలర్ బాలమని బాలరాజు, ఆయా వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.



కంటి వెలుగులో పేదలకు మంచి వైద్యం

ట్రైనీ కలెక్టర్ ఫైజా అహ్మద్

నవతెలంగాణ-నంగునూరు

ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమం ద్వారా పేదలకు మంచి వైద్యం అందుతుందని ట్రైనీ కలెక్టర్ ఫైజా అహ్మద్ అన్నారు. సోమావారం నంగునూరు మండలం వెంకటాపూర్ రైతు వేదికలో ఏర్పాటు చేసిన కంటి శిబిరాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేంద్రియానం నయనం ప్రధానం అని సున్నితమైన భాగాలను ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు. ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమం చక్కటి కార్యక్రమమన్నారు. అన్ని భాగాల కంటే కంటి భాగం ప్రధానమైనదని చిన్న నిర్లక్ష్యం చేయడం వల్ల కంటి చూపు పోయే ప్రమాదం ఉంటుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ కంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజలకు అవగహన కల్పించి వైద్య శిబిరానికి వచ్చేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ వేణుగోపాల్, క్యాంప్ ఇంచార్జి డాక్టర్ శివకేషవరెడ్డి, పిహెచ్ఎన్ హేమలత,హెల్త్ ఆసిస్టెంట్ మల్లేశం, ఎఎన్ఎంలు సావిత్రి, స్వర్ణలత, సరస్వతి, ఆశలు, అంగన్వాడీ టీచర్స్, పంచాయతీ కార్యదర్శి మహేష్ తదితరులు పాల్గొన్నారు..



నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి

డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు యాదవ్



నవతెలంగాణ-చిన్నకోడూరు

రాష్ట్రంలో 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నామని సీఎం కేసీఆర్ శాసనసభలో చెప్పిన మాటలు ఆచరణలో అమలు చేయడం లేదని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు యాదవ్ ఆరోపించారు. చిన్నకోడూరు తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం విద్యుత్ సరఫరా సమస్యల పరిష్కారానికై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ ఇస్తుందనే ధీమాతో అధిక పంటలు వేశారని, కానీ ప్రభుత్వం కేవలం 7గంటల విద్యుత్ సరఫరా అదికూడా ఎప్పుడొస్తుందో ఎపుడు పోతుందో తెలియక రైతులు ఇబ్బందులకు గురౌతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ కోతల వల్ల పంటలు ఎండిపోయే పరిస్థితిలో ఉన్నాయని వెంటనే ప్రభుత్వం 24గంటల విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులతో కలిసి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున్న ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు మీసం మహేందర్, ఉడుత జయంత్, నాగరాజు, మీసం రాజు, నూనె రాజు, మహేందర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

దరిపల్లి శ్రీనుకు కరోనా యోధుల సర్టిఫికేట్



నవతెలంగాణ-సిద్దిపేట : బీఆర్ఎస్ పార్టీ నాయకులు, సిద్దిపేట మార్కెట్ కమిటీ డైరెక్టర్ దరిపల్లి శ్రీనుకు లీడర్స్ పేజీ సంస్థ కరోనా యోధులుగా గుర్తించి సర్టిఫికే ట్‌ను అందజేస్తున్నామని సంస్థ యాజ మాన్య నిర్వాహకులు బోల్లు నర్సింహ యాదవ్ తెలిపారు. సోమవారం దరిపల్లి శ్రీనును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ కరోనా కష్ట కాలంలో నిత్యావసర సరుకులు, మాస్క్, శానిటైజర్స్, పీపీఈ కిట్స్, సేవా కార్యక్రమం చేసినందుకు గుర్తింపుగా ఈ సర్టిఫికెట్ రావడం సంతోషంగా ఉందన్నారు. నాయకులు ఇట్టబోయిన శ్రీనివాస్, వేణుగోపాల్, గంధం రాజు, గోవిందరం శ్రీను, అజయ్, మద్దెల కిషోర్ బాబు పాల్గొన్నారు.

సెలవుపై వెళ్లిన మున్సిపల్ కమిషనర్

ఇన్‌చార్జిగా మేనేజర్ బాలకృష్ణ

నవ తెలంగాణ-గజ్వేల్ : గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ విద్యాధర్ నాలుగు నెలలపాటు సెలవుపై వెళ్లారు. ప్రస్తుతం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళిపై అవిశ్వాసం పెట్టి తొలగించేందుకు 14 మంది సభ్యులు ఇప్పటికే కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ నేపథ్యంలో కమిషనర్ సెలవుపై వెళ్లడం చర్చాంశంగా మారుతుంది. మున్సిపల్ మేనేజర్‌గా పనిచేస్తున్న బాలకృష్ణకు నాలుగు నెలలపాటు బాధ్యతలు అప్పగించారు.

వివాహ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు



నవతెలంగాణ- నారాయణఖేడ్

రామోజీ ఫిలిం సిటీలో జరిగిన బేతి సుభాష్ రెడ్డి కుమారుని వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు , నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్ రెడ్డి, ఆందోల్ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్‌లు పాల్గొన్నారు. ఎమ్మెల్యేలు నూతన వధూవరులను ఆశీర్వదించారు.

నవతెలంగాణ-నారాయణఖేడ్

హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ జాగృతి రాష్ట్ర నాయకులు మఠం బిక్షపతి తమ్ముని వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే ఎమ్మెల్యే మహా రెడ్డి భూపాల్ రెడ్డి పాల్గొన్నారు. నూతన వధూవరులను ఆశీర్వదించిన జాగృతి జిల్లా నాయకులు అరుణ్, రాజ్, తదితరులు పాల్గొన్నారు.



చదువుకుంటేనే సమాజంలో గుర్తింపు



నవతెలంగాణ-రాయపోల్

ప్రతి ఒక్కరూ ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థాయికి ఎదిగితేనే సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందని తలకొక్కుల చంద్రకళ లక్ష్మణ్ చారిటబుల్ ట్రస్ట్ కోశాధికారి తలకొక్కుల దుర్గ ప్రసాద్ అన్నారు. సోమవారం రాయపోల్ మండలం రాంసాగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలకు తలకొక్కుల చంద్రకళ లక్ష్మణ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు 50 స్పోకెన్ ఇంగ్లీష్ గ్రామర్ బుక్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో ఇంగ్లీష్ నాలెడ్జ్ పెంపొందించడానికి ఇంగ్లీష్ గ్రామర్ బుక్స్ ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ఇంగ్లీష్ సబ్జెక్ట్ అనగానే విద్యార్థులు భయపడతారని ఎలాంటి అపోహలు లేకుండా అర్థం చేసుకుని చదివితే సులభతరం అన్నారు. విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచి లక్ష్యాన్ని నిర్దేశించుకుని సాధించేవరకు కష్టపడి చదవాలన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి చదువుకొని ఉన్నత స్థాయికి ఎదిగితేనే సమాజంలో గుర్తింపు ఉంటుందన్నారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్తయ్య మాట్లాడుతూ పాఠశాల విద్యార్థుల విద్యాభ్యాసం కోసం ఇంగ్లీష్ నేర్పించడానికి సహకారం అందించిన సత్యసాయి సేవాసమితి వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొండారి సంధ్యారాణి గణేష్, తలకొక్కుల చంద్రకళ లక్ష్మణ్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు మధుసూదన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బచ్చలి సత్తయ్య, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

14న చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి

బీఎంఎస్ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు సల్ల శ్రీనివాస్



నవ తెలంగాణ- గజ్వేల్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 14వ తేదిన ఉదయం 10 గంటలకు ఇందిరా పార్కు దగ్గర జరిగే ధర్నా కార్యక్రమాన్ని విజయవం తం చేయాలని బీఎంఎస్ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు సల్ల శ్రీనివాస్ కోరారు. మున్సిపల్ పరిధిలో గల ప్రజ్ఞాపూర్ రాణే పరిశ్రమ దగ్గర " చలో హైదరాబాద్ " కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బి.యం.యస్ ప్రధాన కార్యదర్శి పి.శ్రీశైలం ఆధ్వర్యంలో వాల్ పోస్టర్లు విడుదల చేశారు. ఈసందర్భంగా సల్ల శ్రీనివాస్, పి.శ్రీశైలంలు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులను పూర్తిగా విస్మరిస్తున్నాయన్నారు. బీఎంఎస్ నాయకులు నాగభూషణం, నజీర్, యాదగిరి, కిష్టయ్య, శ్రీనివాస్, దేవయ్య, బాలయ్య మల్లయ్య, భాస్కర్, రంగయ్య, సురేందర్ రెడ్డి, జయపాల్ రెడ్డి, కిషోర్ బాబు, ఈమాముద్దీన్, విజయ్ కుమార్, సంజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మామిడిగిలో ఉపాధి పనులు ప్రారంభం



- సర్పంచ్ చంద్రప్ప

నవతెలంగాణ-న్యాల్‌కల్

వలసల నివారణకు కూలీలకు ప్రభుత్వం కల్పించిన ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మామిడిగి గ్రామ సర్పంచ్ చంద్రప్ప, ఫీల్డ్ అసిస్టెంట్ జగన్నాథ్ రెడ్డిలు తెలిపారు. మామిడిగిలో సోమవారం ఉపాధి పనులను సర్పంచ్ చంద్రప్ప ఫీల్డ్ అసిస్టెంట్ జగన్నాథ్ రెడ్డిలు ప్రారంభించారు. మామిడిగి గ్రామపంచాయతీలో కూలీలకు ఉపాధి పనులు కల్పించడం కోసమే ఉపాధి పనులు ప్రారంభమయ్యాయన్నారు. మొదటి రోజు 25 మంది కూలీలతో ఉపాధి పనులు ప్రారంభించారు ఉపాధి హామీ పనులు చేసుకోవాలనుకునేవారు జాబ్ కార్డు తప్పనిసరన్నారు. జాబ్ కార్డు లేని వారు గ్రామ సర్పంచ్, ఫీల్డ్ అసిస్టెంట్‌ను సంప్రదించాలని తెలిపారు. ఉపాధి కూలీలు పనులు ప్రారంభంతో సంతోషం వ్యక్తం చేశారు.

నవతెలంగాణ

3



మెదక్

మంగళవారం 14 ఫిబ్రవరి 2023



చికెన్ ధరలు (కే.జి)

ఫారేటు	- రూ. 96
రిటైల్	- రూ. 118
విత్‌స్కిన్	- రూ. 171
స్కిన్‌లెస్	- రూ. 195

శాసనమండలి డిప్యూటీ చైర్మన్‌కు సన్మానం



నవతెలంగాణ- నిజాంపేట

శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డా. బండ్ల ప్రకాష్ ముదిరాజ్‌ను హైదరాబాదులోని శాసనమండలిలో మండల పరిధిలోని కె వెంకటాపూర్ గ్రామానికి చెందిన బి.ఆర్.ఎస్ సీనియర్ నాయకులు దయాకర్, గ్రామస్తులు కలిసి శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా దయాకర్ ముదిరాజ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముదిరాజ్ కులాలకు అత్యధిక ప్రాధాన్యతనిస్తుందన్నారు. బండ్ల ప్రకాష్ ముదిరాజ్‌ను శాసనమండలి డిప్యూటీ చైర్మన్ గా నియమించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వెంకటాపూర్ గ్రామానికి చెందిన కాశమైన దయాకర్, కల్వకుంట ఉపసర్పంచ్ పద్మలత నర్సింలు, వార్డు సభ్యులు రాజు, సత్యం , నర్సింలు, పెంటయ్య, రమేష్, నందు, వెంకటి, కైలాస్, వెంకటరములు, లింగయ్య, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి



- మండల వైద్యాధికారి వికాస్

నవతెలంగాణ-పెద్ద శంకరంపేట్

ప్రభుత్వం అమలు చేస్తున్న కంటి వెలుగు వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరు సద్వినిగం చేసుకోవాలని పెద్ద శంకరంపేట మండల వైద్యాధికారి వికాస్ అన్నారు. సోమవారం పేటలో కంటి వెలుగు వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. కంటి వెలుగు శిబిరంలో పరీక్షలు చేసిన అనంతరం అవసరమైన వారికి వెంటనే కళ్లద్దాలు పంపిణీ చేయడం జరుగుతుందని. కొన్ని సమస్యలు ఉంటే 15 రోజుల్లో వారికి కూడా కళ్లద్దాలు పంపిణీ చేయడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో కంటి వెలుగు ప్రోగ్రాం వైద్యాధికారి హర్ష పిహెచ్సి సిబ్బంది సంపూర్ణ స్వప్న వెంకటేష్ సాయిలు సంజయ్ నాగమణి సంతోష తదితరులు పాల్గొన్నారు.

దుర్గాదేవి ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం



నవతెలంగాణ-చిన్న శంకరంపేట

మండల పరిధిలోని జంగారాయి గ్రామంలో దుర్గాదేవి తొమ్మిదవ వార్షికోత్సవ సందర్భంగా మూడు రోజులుగా కొనసాగుతుంది. ఈ కార్యక్రమంలో భాగంగా సోమవారం దుర్గాదేవి ఆలయం వద్ద ఉదయం గణపతి పూజ, అమ్మవారికి అభిషేకం, ఆకండ దీపారాధన చేశారు, గ్రామానికి చెందిన అన్నదాత భూపాల్ రెడ్డి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించి అన్నదాన కార్యక్రమాలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఆవుల భాగ్యలక్ష్మి గోపాల్ రెడ్డి, స్థానిక సర్పంచ్ బందెల జ్యోతి ప్రభాకర్, ఏఎంసి డైరెక్టర్ మేఘమాల, మాజీ పిఏసిఏస్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, బాగా రెడ్డి, భూపాల్ రెడ్డి సిద్ధి రెడ్డి పాల్గొన్నారు.

ఎస్సై శివకుమార్‌ను సన్మానించిన అబ్బు బాయ్



నవతెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ నూతన ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన శివకుమార్‌ను. సోమవారం బిఆర్ఎస్ నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. ఎండల బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షులు అబ్బు బాయ్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు.

భూంపల్లి ఎస్సైగా గంగరాజు



నవతెలంగాణ-మిరుదొడ్డి

భూంపల్లి నూతనం ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన గంగరాజును సోమవారం బీఆర్ ఎస్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్ఐని కలిసిన వారిలో బీఆర్ ఎస్ రాష్ట్ర కార్యదర్శి బక్కి వెంకటయ్య, ఆత్మ కమిటీ చైర్మన్ భాస్కర చారి మిడి దొడ్డి ఎంపీపీ సాయిలు, బీఆర్ఎస్ నాయకులు మూర్తి శ్రీనివాస్ రెడ్డిలు ఉన్నారు.

మంత్రిని కలిసిన మాంకాల నవీన్ కుమార్



నవతెలంగాణ-సిద్దిపేట

శాసన సభ సమావేశాలు విజయవంతంగా ముగిసిన సందర్భముగా మంత్రి హరీశ్ రావును మర్యాద పూర్వకంగా కలిసి, మొక్కను అందజేసి అభినందనలు తెలిపినట్లు శ్రీ సంతోషిమాత దేవాలయ చైర్మెన్ మాంకాల నవీన్ కుమార్ తెలిపారు. ఈ అభినందన కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు గాదగోని సత్యం గౌడ్, కాముని ప్రభాకర్, గందె మాధురి, కొమరవెల్లి కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

మండలంలో రూ.రెండు కోట్ల పనులు



నవతెలంగాణ-మునిపల్లి

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తున్నదని మునిపల్లి మండల .జెడ్పీటీసీ మీనాక్షి పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సీఎం కేసీఆర్ సహకారంతో ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ కృషితో ఇప్పటివరకు రూ. 10 కోట్లతో అంతర్గత రహదారుల నిర్మాణం చేపట్టామన్నారు. మరో 2.45 కోట్లతో అంతర్గత నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని ఆమె చెప్పారు. ఇదివరకు మండలంలో పది గ్రామాల్లో వంద శాతం అంతర్గత రహదారుల నిర్మాణం పూర్తయిందని మరో పద్దెనిమిది గ్రామాల్లో అంతర్గత రహదారుల పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ సందర్భంగా ఆమె సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల రైతు బంధు సమితి అధ్యక్షులు పరశురాం గౌడ్, మాజీ మండల పరిషత్ అధ్యక్షులు చంద్రయ్య, విజయ్ కుమార్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పైతర సాయికుమార్, యువత అధ్యక్షుడు ఆనంద్ రావు, ఆయా గ్రామాల సర్పంచ్ లు, ఎంపీటీసీలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలలో కొత్త వ్యక్తుల సమాచారం ఇవ్వండి

- శాంతికి భంగం కలిగిస్తే చర్యలు తప్పవు
- మెదక్ డీఎస్పీ సైదులు



నవతెలంగాణ-హవేలీ ఘనాపూర్

గ్రామాల్లో కొత్త వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని,ప్రజల శాంతికి భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని మెదక్ డీఎస్పీ సైదులు అన్నారు. సోమవారం మండల పరిధిలోని లింగసన్ పల్లి తండాలో మెదక్ జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని ఆదేశానుసారం మెదక్ రూరల్ సర్కిల్, హవేలీ ఘనపూర్ పోలీస్ స్టేషన్ పరిది లోని లింగసాన్ పల్లి తాండాలో మెదక్ డీఎస్పీ సైదులు ఆద్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రామ్‌లో భాగంగా సీఐ, ఎస్సైలు ఇద్దరు మొత్తం 35 మంది పోలీసు అధికారులతో కలిసి డిఎస్‌పీ ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి సుమారు 150 ఇళ్లను సోదాలు చేశారు. ఈ సందర్భంగా మెదక్ డిఎస్పి సైదులు మాట్లాడుతూ గ్రామాలలో సీసీ కెమెరాల ప్రాముఖ్యతను తెలియజేస్తూ సైబర్ నేరాలపై గ్రామ ప్రజలకు అవగాన కల్పించారు. సైబర్ నేరగాళ్ల వలలో పడవద్దని అప్రమత్తంగా ఉండాలన్నారు. డయల్ 100 ప్రాముఖ్యత , రోడ్డు ప్రమాదాల నివారణ అంశాలపై అవగాహన కల్పించారు. పెండింగ్ చాలాన్, నంబర్ ప్లేట్ సరిగా లేని,పత్రాలు సరిగాలేని ద్విచక్ర వాహనాలు29, 01 ఆటో, మొత్తం 30 వాహనాలను అదుపులోకి తీసుకొని హవేలీ ఘనపూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సంబంధిత వాహనాల యజమానులు తమ వాహనాల పత్రాలను చూపించి వాహనాలను తీసుకువెళ్లాలన్నారు. కాలనీలలో మరింత స్వీయ రక్షణ కొరకు సీసీ కెమెరాలను అమర్చుకోవాలని ,భద్రతా పరమైన అంశాలలో సీసీ కెమెరాలు కీలక పాత్ర వహిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెదక్ రూరల్ సీఐ విజయ్ ,ఎస్సై శేఖర్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు

- పీసీసీ ఉపాధ్యక్షులు సంజీవరెడ్డి



నవతెలంగాణ-పెద్ద శంకరంపేట్

ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పాలన కొనసాగిస్తున్నాయని పీసీసీ ఉపాధ్యక్షుడు సంజీవరెడ్డి అన్నారు. సోమవారం హాత్ సే హాత్ జోడో యాత్ర కార్యక్రమంలో భాగంగా పెద్ద శంకరంపేట మండల పరిధిలోని కొప్పుల్ ఉమా సంగమేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పాదయాత్రగా కొత్తపేట, నారాయణ పల్లి, విరోజి పల్లి,గ్రామాలలో చేరుకొని ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ కల్లబొల్లి మాటలను నమ్మి ప్రజలు మరోసారి మోసపోవద్దన్నారు. ప్రశ్నించే గొంతుకకు పట్టం కట్టాలని ఆయన కోరారు. కేసీఆర్ ప్రభుత్వ వైఫల్యాలను కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు గడపగడపకు తీసుకువెళ్లి వివరించాలన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నిలబెట్టుకోకుండా ప్రజలను మోసం చేస్తూ మరిన్ని నూతన హామీలను ఇస్తుందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా శ్రమించి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేలా కృషి చేయాన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద శంకరంపేట మండల కాంగ్రెస్ నాయకులు దానం పల్లి నారా గౌడ్ దాచ సంగమేశ్వర్ ఎంపిటిసి రాజు నాయక్ సర్పంచ్ అంజిరెడ్డి నాయకులు రాజశేఖర్ రెడ్డి రవీందర్ శ్రీనివాస్ గోవింద్ రావు పటేల్ సుదర్శనం సంగమేశ్వర్ సాయిలు విజయరావు గోపాల్ రెడ్డి ప్రవీణ్ నవీన్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం

- తీర్మానం కాపీని జిల్లా కలెక్టర్‌కు అందజేత



నవతెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్‌పై మున్సిపల్ కౌన్సిలర్లు 8 మంది అవిశ్వాస తీర్మానం చేసి సోమవారం జిల్లా కలెక్టర్ రాజర్షి షాకు అందజేశారు. నర్సాపూర్ మున్సిపల్ కౌన్సిలర్లు మున్సిపల్ వైస్ చైర్మన్ 6వ వార్డు కౌన్సిలర్ నాయిమ్ ఉద్దీన్, 1వ వార్డు కౌన్సిలర్ అశోక్ గౌడ్, 3వ వార్డు కౌన్సిలర్ ఇశ్రా సిద్ధికి, 7వ వార్డు కౌన్సిలర్ గొల్ల రుక్కమ్మ, 8వ వార్డు కౌన్సిలర్ పంబల రామచందర్,, 12వ వార్డు కౌన్సిలర్ చెలిమేటి లక్ష్మీ నాగేష్, 14వ వార్డు కౌన్సిలర్ తంగడపల్లి సరిత ఆంజనేయులు గౌడ్, 15వ వార్డు కౌన్సిలర్ పంబల లలిత బిక్షపతిలు, నర్సాపూర్ మున్సిపల్‌లో మున్సిపల్ చైర్మన్ మురళి యాదవ్‌పై అవిశ్వాసం ప్రకటించి తీర్మానం చేశారు. దీంతో నర్సాపూర్ లో రాజకీయం వేడెక్కింది. త్వరలోనే అవిశ్వాసం కోసం సమావేశం ఏర్పాటు చేసే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

ప్రజావాణి విజ్ఞప్తులను సత్వరమే పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ రాజర్షి షా

నవతెలంగాణ-మెదక్ రూరల్

ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన విజ్ఞప్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులకు సూచించారు. ప్రజావాణికి వచ్చే ఫిర్యాదీదారులతో మమేకమై వారి సమస్యలను సావధానంగా పరిశీలించి పరిష్కార దిశగా కృషి చేయాలని, నిర్లక్ష్యం వహించరాదని సూచిం చారు. పరిష్కరించుటకు వీలులేని పక్షంలో తదుపరి చర్యల కోసం వారికి అర్థమయ్యే విధంగా సూచనలు అందించాలన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదిదారుల నుంచి 67 విజ్ఞప్తులను అదనపు కలెక్టర్లు ప్రతిమ సింగ్, రమేష్‌లతో కలిసి స్వీకరించారు. ఇందులో ప్రధానంగా ధరణి, భూ సమస్యలు, పోడు భూములు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, ఆసరా పింఛన్లు తదితర అంశాలకు సంబంధించి వి ఉన్నాయి. భూ సమస్యలకు సంబంధించి ధరణిలో ఉన్న మడ్యూల్స్ ప్రకారం పరిష్కరించాలని, భూ వివాదాలకు సంబంధించి కోర్టును ఆశ్రయించవలసినదిగా ఫిర్యాదీదా రులకు సూచించాలని, డబుల్ బెడ్ ఇండ్ల ఫిర్యాదుల కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వెంకట శైలేష్, జయరాజ్, శ్రీనివాస్, చందు నాయక్, జెంలా నాయక్, కేశూరం, విజయ శేఖర్ రెడ్డి, సాయిబాబ, ఆశా కుమారి,

ఇంటర్మీడియట్ వార్షిక ప్రయోగ పరీక్షలు

- జిల్లా అధికారి సత్యనారాయణ



నవతెలంగాణ-మెదక్ రూరల్

ఇంటర్మీడియట్ వార్షిక ప్రయోగ పరీక్షలు మెదక్ పట్టణంలోని ప్రభుత్వ బాలూర జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేశామని జిల్లా విద్యాధికారి సత్యనారాయణ తెలిపారు. చీఫ్ సూపరింటెండెంట్ . డిపార్ట్‌మెంటల్ అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్ జరిగే ప్రయోగ పరీక్షల గురించి అవగాహన కల్పించారు. పరీక్షలు తేది 15-02-2023 నుంచి 02-03-2023 వరకు మూడు విడతలలో జరగనున్నాయని తెలిపారు. జిల్లాలో 35 సెంటర్లలలో జనరల్ విభాగంలో 1206, వోకేషనల్ 280 విద్యార్థులు ప్రయోగ పరీక్షలకు హాజరు కానున్నారన్నారు. ప్రయోగ పరీక్షలు సజావుగా నిర్వహించడానికి అన్ని సెంటర్ల చీఫ్-సూపరింటెండెంట్లకు తగిన సూచనలు జారీ చేశారు. ప్రవేట్ యాజమాన్యాలు విద్యార్థులకు ప్రయోగ పరీక్షల హాల్ టికెట్స్ ఇవ్వడానికి ఇబ్బందులకు గురిచేస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్షలు 9 గం నుంచి 12:00 వరకు, మధ్యాహ్నం 2:00 నుంచి 5.00వరకు రెండు సెషన్లలో జరుగుతాయని తెలిపారు. విద్యార్థులు పరీక్షల సమయానికి అరగంట ముందుగా పరీక్షా కేంద్రంలో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంటర్మీడియట్ విద్యాధికారి సత్యనారాయణ, జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు శశిధర్, అశోక్. జిల్లా ప్రిన్సిపాల్ సంఘ అధ్యక్షులు అవనీష్ రెడ్డి, జూనియర్ లెక్చరర్ల సంఘ ప్రధాన కార్యదర్శి. శ్రీకాంత్ , మధుసూధన్ . ప్రభుత్వ ప్రైవేట్ కళాశాల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

నిజాంపేటలో గ్రామసభ



నవతెలంగాణ-నిజాంపేట

మండల కేంద్రంలోని కచేరి వద్ద గ్రామ సర్పంచ్ అనూష లక్ష్మీనరసింలు ఆధ్వర్యంలో సోమవారం గ్రామసభ నిర్వహించారు. గ్రామంలోని మంచినీటి సమస్య , వీధిలైట్లు , నూతన కచేరిని నిర్మించడం, సిసి రోడ్లు, మోరిలను కట్టించడం, గ్రామంలోని బొడ్రాయి, శివాలయం మరమ్మత్తులు, తదితర విషయాలపై చర్చించారు. గ్రామ ప్రజలకు సేవ చేస్తామని చెప్పి ఎన్నికలలో నిలబడి గెలిచిన తర్వాత కొందరు వార్డు మెంబర్లు హాజరు కాకపోవడమేమిటని పలువురు గ్రామస్తులు వాపోయారు. వార్డు సమస్యలను కూడా పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ సందర్భంగా సర్పంచి అనూష లక్ష్మీనరసింహులు మాట్లాడుతూ గ్రామంలో సిసి రోడ్లు నిర్మించడానికి ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి ఎన్ఆర్‌జిఎస్ పథకంలో భాగంగా కోటి 30 లక్షల రూపాయలను మంజూరు చేశారన్నారు. సిసి రోడ్ల పనులను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తలిపారు. గ్రామంలో మురికి కాలువల వెంబడి దోమల మందు పిచాకారు చేయిస్తానన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను కూడా త్వరలో చేపడతామన్నారు. ఉప సర్పంచ్ బాబు మాట్లాడుతూ గ్రామంలో రోడ్లన్నీ కబ్జాలకు గురవుతున్నాయని వెంటనే గ్రామపంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. గత సంవత్సరం తైబజార్ వేలం పాడిన డబ్బులు దాదాపు రెండు లక్షల 60 వేల వరకు రావాల్సి ఉండగా ఇప్పటికీ గ్రామపంచాయతీకి జమ కాకపోవడం ఏమిటని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాభివృద్ధి కోసం కేటాయించిన నిధులు 3 లక్షల 50 వేల గ్రామాభివృద్ధికి ఖర్చు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి నర్సింలు, కారోబార్ కొండల్ రెడ్డి, అంగన్వాడీ టీచర్లు అరుణశ్రీ, మణెమ్మ ,రేణుక , దుర్గ , ఆశ వర్కర్లు బండారి అనిత, కొమ్మాట బాలమణి, బండారి లక్ష్మి లైన్మెన్ రమేష్, వార్డు మెంబర్లు గుడ్ల యేసుమని ,మావురం రాజు, తాడెం తిరుపతి, ఎమ్మార్పీఎస్ గరుగుల శ్రీనివాస్, నాయిని లక్ష్మణ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పాటు

- గ్రామ పంచాయతీలకు నూతన బిల్డింగులు

నవతెలంగాణ-మెదక్ రూరల్

మెదక్ నియోజకవర్గ పరిధిలోని తొమ్మిది గ్రామపంచాయతీలకు నూతన బిల్డింగులు మంజూరు జీవో నెంబర్ 32 జారీ చేయడం జరిగిందని ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి తెలిపారు. అధికారులలో చరవాణితో మాట్లాడుతూ ట్రైబల్ వెల్ఫేర్ శాఖ ద్వారా ఎస్‌టీహెచ్డిఎఫ్ నుంచి మెదక్ నియోజకవర్గంలోని 9 గ్రామపంచాయతీలకు నూతన భవనాలను మంజూరు చేస్తూ జీవో నెంబర్ 32 జారీ చేయడం జరిగిందన్నారు. మెదక్ నియోజకవర్గంలోని హవేలీ ఘన్పూర్ మండలం కొచ్చెరువు తాండ, శంకరంపేట ఆరు మండలంలోని గవ్వలపల్లి ఎల్టి జంగరాయి ఎల్టి కామారం ఎల్టి కాజాపూర్ ఎల్‌టి మిర్జాపల్లి ఎల్‌టి సంకాపూర్ ఎల్‌టి, అదేవిధంగా పాపన్నపేట మండలంలోని అంరియా తాండ, దాక్య తండా, పొడ్చానపల్లి తండా గ్రామాలకు నూతన గ్రామపంచాయతీ భవనాలు మంజూరు చేయడం జరిగిందని ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి తెలిపారు.

మండల కేంద్రంలో ఎస్టీ హాస్టల్ ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ- నిజాంపేట

నిజాంపేట మండల కేంద్రంలో ఎస్టీ హాస్టల్ ఏర్పాటు చేయాలని మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమావత్ వినోద్ అన్నారు. మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలం ఏర్పడి దాదాపు ఏడు సంవత్సరాలు అవుతున్నప్పటికీ మండల కేంద్రంలో ఎస్టీ హాస్టల్ లేకపోవడం విచారించదగ్గ విషయమన్నారు. నిజాంపేట మండలంలో జడ్చర్ తాండ గ్రామపంచాయతీ, నగరం తాండ గ్రామపంచాయతీ, కాశీపూర్ తాండ, బచ్చు రాజు పల్లి తాండ, షౌకత్ పల్లి తండా, వెంకటాపూర్ తండా, అత్యధిక లంబాడీలు గల మండలంలో ఎస్టీ హాస్టల్ లేకపోవడం చాలా బాధాకరమన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము ప్రతి మండల కేంద్రాల లో ఎస్టి హాస్టల్లో నెలకొల్పాలని ప్రభుత్వాలు చెప్పినప్పటికీ నాయకులు అధికారులు పట్టించుకోవడం లేద న్నారు. ఈ తండాలకు సరియైన బస్సు సౌకర్యం లేక లంబాడి బిడ్డలు చదువును మధ్యలోనే ఆపివేస్తున్నారని, పై చదువులు చదవాలంటే మండల కేంద్రంలో ఎస్టీ హాస్టల్ అత్యవసరమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అధికారులు వెంటనే స్పందించి నిజాంపేట మండల కేంద్రంలో ఎస్టీ హాస్టల్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలి

- తహసీల్దార్‌కు వినతి
- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నరేందర్



నవతెలంగాణ-వెల్దుర్తి.

ఎన్నికల మేనిఫెస్టోలో అర్హులైన నిరుపేదలకు ఇంటి స్థలాలతో పాటు డబుల్ బెడ్ రూమ్ కట్టించి ఇస్తామని ప్రగల్భాలు పలికి ఇప్పటివరకు నిరుపేదలను ఆదుకున్న పాపాన పోలేదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నరేందర్ అన్నారు సోమవారం మాసాయిపేట మండల కేంద్రంలో అర్హులైన నిరుపేదలతో కలిసి తహసీల్దార్ మాలతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాటాడారు మండల వ్యాప్తంగా ఎందరో నిరుపేదలు పూరి గుడిసెల్లో నివాసముంటూ చలికి, వానకు భరించుకుంటూ కాలం వెల్లదీస్తున్నార న్నారు. రాష్ట్ర ప్రభుత్వం అరులైన వారికి డబుల్ బెడ్ రూమ్‌లు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఐలయ్య, కార్యదర్శి బాబు, నిరుపేదలు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు పశుగ్రాసం దగ్ధం

- రూ.1,50 లక్షల ఆస్తి నష్టం



నవతెలంగాణ-వెల్దుర్తి

ప్రమాదవశాత్తు 600 వందల పశుగ్రాసం గడ్డిమోపులు దగ్ధమైన సంఘటన మండల కేంద్రంలో చేరిలా గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. బాధితులు దగ్గుల బిక్షపతి తెలిపిన వివరాల ప్రకారం రోజువారి లాగే పశువులను, గొర్లను కొట్టం వద్ద నుంచి వేపడానికి కొట్టుకపోవడం జరిగిందన్నారు పశువుల పాక వద్దనే 600 గడ్డిమోపుల ఉండగా అకస్మాత్తుగా మంటలు చెలరేగి తగలబడిపోయా యన్నారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా మెదక్ నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేసే ప్రయత్నం చేశారు. అయినా మంటలు ఎగిసిపడి పూర్తిగా దగ్ధమైందన్నారు. పశువులకు మేయడానికి ఒక గడ్డిమోపు కూడా మిగలకుండా పూర్తిగా దగ్ధమైందన్నారు. సుమారు రూ.1.50 లక్షల నష్టం సంభవించినట్లు తెలిపారు. రోజు పశువులకు ఏమి మేత పెట్టాలని దిగులు పడుతూ ఆవేదన వ్యక్తం చేశారు.

కస్తూర్బా గాంధీ పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం



నవతెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ మండలం చిప్పల్ తుర్తి గ్రామ పరిధిలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో సోమవారం ఇంటర్ రెండవ సంవత్సరం, 10వ తరగతి విద్యార్థినిలు ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినిలు ఒక్కరోజు ఉపాధ్యాయులుగా వ్యవహరించి విద్యార్థినిలకు విద్యాబోధన కావించారు. ఇంచార్జి స్పెషల్ ఆఫీసర్ ఎస్ మమత ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు విద్యార్థినిలను పర్యవేక్షిస్తూ ఉత్తమ ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థినిలను గుర్తించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇంచార్జి స్పెషల్ ఆఫీసర్ మమత మాట్లాడుతూ విద్యార్థి దశలోనే ఇలాంటి స్వయం పరిపాలన దినోత్సవ కార్యక్రమం నిర్వహించుకోవడం వలన విద్యార్థులలో మనోధైర్యం పెంపొందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విశాలక్ష్మి, గీత, మల్లికా, శోభా, సవీనాలు పాల్గొన్నారు.

వరి పంట సస్యరక్షణపై రైతులకు అవగాహన

- వ్యవసాయ అధికారిని స్వప్న



నవతెలంగాణ-వెల్దుర్తి.

యాసంగి సీజన్లో వరి నారుమడులలో చేపట్టాల్సిన సస్యరక్షణపై వ్యవసాయ అధికారిని స్వప్న రైతులకు అవగాహన కల్పించారు. సోమవారం మండల కేంద్రంలో వ్యవసాయ క్షేత్రాన్ని వ్యవసాయ అధికారి స్వప్న పరిశీలించి తగు సూచనలను చేశారు రైతులు వేసిన పంటకు ఎంత మోతాదులో వేసుకోవాలనే విషయంపై వ్యవసాయ శాస్త్రవేత్తలను లేదా మండల వ్యవసాయ అధికారులను సంప్రదించి వాడుకోవాలని సూచించారు. ఎకరాకు ఎంత మోతాదులో వాడాలి అనే దానిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎక్కువ మోతాదులో ఎరువులను వాడినట్లయితే నష్టం కలిగి రైతు ఆర్థికంగా కృంగిపోయే అవకాశాలుంటాయన్నారు అందుకు రైతులు మండల వ్యవసాయ అధికారులను సంప్రదించి సూచనలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో రేవతి ఉత్తంకుమార్, రైతులు పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించిన జిల్లా వైద్యాధికారి



నవతెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ మున్సిపాలిటలోని పెద్దమ్మ కాలనీలో నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని సోమవారం జిల్లా వైద్యాధికారి చందు నాయక్ సందర్శించి పరిశీలించారు. కంటి వెలుగులో భాగంగా కంటి పరీక్షలు చేయించుకునేందుకు వచ్చిన ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కంటి పరీక్షలు చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. అవసరమైన వారికి అద్దాలు మందులు పంపిణీ చేయాలన్నారు.



గాగిల్లాపూర్‌లో కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభం



నవతెలంగాణ-మద్దూరు

మండలంలోని గాగిలాపూర్ గ్రామంలో కంటి వెలుగు రెండో విడత కార్యక్రమాన్ని సర్పంచ్ బొల్లు కృష్ణవేణి చంద్రమౌళి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి రైతుబంధు మండల అధ్యక్షుడు మేక సంతోష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు రెండో విడత కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మేక మాధవి గోపాల్, పంచాయతీ కార్యదర్శి గద్ద వెంకటేశ్వర్లు వార్డు సభ్యులు వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సరోజినీ నాయుడు జయంతి ఉత్సవాలు



నవతెలంగాణ-గజ్వేల్

స్థానిక గజ్వేల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో భారత కోకిల సరోజినీ నాయుడు 143వ జన్మ శతాబ్దిని పురస్కరించుకుని జాతీయ మహిళా దినోత్సవాన్ని జాతీయ సేవా పథకం ఎన్ఎస్ఎస్ రెండు యూనిట్లు కళాశాల ప్రాంగణంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీవీ ఉమా శశి మాట్లాడుతూ సరోజినీ నాయుడు దేశభక్తితోపాటు మహిళా హక్కుల గురించి జాతీయ ఉద్యమంలో పోరాటం చేశారన్నారు. అదేవిధంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ సార్వాణి ప్రసంగిస్తూ సరోజినీ నాయుడు జాతీయోద్యమ పోరాట అంశాల గురించి ఆమె గొప్పతనాన్ని గురించి కొనియాడారు. ఈ కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ యూనిట్ 1 ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీమతి కస్తూరిబాయ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ ఎకనామిక్స్ మరియు ఎన్ఎస్ఎస్ యూనిట్ 2 ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి జయరాజు లెక్చరర్ ఇన్ హిస్టరీ అధ్యాపక బృందం విద్యార్థులు పాల్గొని విజయవంతం చేశారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



నవతెలంగాణ-దౌల్తాబాద్

దుబ్బాక ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్ రావు చొరవతో బాధిత కుటుంబానికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసినట్లు బీజేపీ మండల ఉపాధ్యక్షులు స్వామి తెలిపారు. సోమవారం దౌల్తాబాద్ మండలం మహమ్మద్ షాపూర్ గ్రామానికి చెందిన కావేటి బాబుకు రూ.24 వేల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అబ్బ గౌని రామస్వామి గౌడ్ బూత్ అధ్యక్షులు బాబు, గ్రామ కార్యకర్తలు సంజీవరెడ్డి, స్వామి మురళి, నవీన్, రవి, ధర్మారెడ్డి తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్చక ఉద్యోగులకు వేతనాలు ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ



నవతెలంగాణ-సిద్దిపేటల

అర్చక ఉద్యోగులకు వేతనాలు ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ రాష్ట్రం అని తెలంగాణ అర్చక ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు కృష్ణమాచార్యులు అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ అసెంబ్లీలో అర్చక ఉద్యోగులకు రూ.130 కోట్లను ఆర్థిక శాఖ మంత్రి హరీశ్ రావు ప్రకటించడం పట్ల సీఎం కేసీఆర్‌కు అర్చక ఉద్యోగుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి అర్చక సమైక్య రుణపడివుంటుందన్నారు.

పోచయ్య కుటుంబానికి అండగా ఉంటాం



నవతెలంగాణ-తొగుట

పోచయ్య కుటుంబానికి అండగా ఉంటామని బీఆంఎస్ నాయకులు హామీ ఇచ్చారు. సోమవారం మండలంలోని చందాపూర్ గ్రామానికి చెందిన బేజగామ పోచయ్య ఇటీవల అనారోగ్యంతో బాధ పడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి, టీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు సిలివేరి రాంరెడ్డి, స్థానిక సర్పంచ్ బొడ్డు నర్సింలు, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు కంకణాల నర్సింలు పోచయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుని సోదరులు నర్సయ్య, కిష్టయ్య, ధర్మయ్యలను మరణానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. రైతు భీమా ద్వారా పోచయ్య కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం అందుతుందని తెలిపారు. పరామర్శించిన వారిలో మండల యూత్ అధ్యక్షుడు అరుణ్ కుమార్, ఉపాధ్యక్షుడు బెజ్జనమైన కనకరాజు, నాయకులు మంగ నరసింహులు, మంగ యాద గిరి, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

పౌష్టికాహారంతో గర్భిణులు, బాలింతలు ఆరోగ్యం



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

పౌష్టికాహారంతోనే గర్భిణులు బాలింతలు ఆరోగ్యంగా ఉంటారని సర్పంచ్ వంగ విజయలక్ష్మి అన్నారు. సోమవారం వంగ రామయ్య పల్లి గ్రామంలోని అంగన్ వాడి సెంటర్‌లో గర్భిణులు, బాలింతలకు కోడిగుడ్లను పాల ప్యాకెట్లను పంపిణీ చేశారు. ప్రతిరోజు వైద్యులు చెప్పే సలహాలు, సూచనలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడి టీచర్, పంచాయతీ కార్యదర్శి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

చిత్తశుద్ధుంటే బీఆర్ఎస్ బీసీ కుల గణన చేపట్టాలి



- బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామచంద్రం డిమాండ్

నవతెలంగాణ-బెజ్జంకి

దేశంలోని అడవి జంతువుల గణన చేపట్టిన అధికార ప్రభుత్వాలు..మానవుల గణన చేపట్టంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని చిత్తశుద్ధి ఉంటే అధికార బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం బీసీ కులగణన వెంటనే చేపట్టాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిషాని రామంచంద్రం డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో స్థానిక గ్రామ పంచాయితీ కార్యలయ అవరణం వద్ద బీఎస్పీ పార్టీ ఆధ్వర్యంలో బీసీ రిజర్వేషన్లను 52 శాతానికి పెంచాలని డిమాండ్ చేస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. బీఎస్పీ నాయకులు లింగాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో బియ్యం పంపిణీ



నవతెలంగాణ-సిద్దిపేట

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో నల్ల రవి సహకారంతో అన్నపూర్ణ పథకం కింద 10 మంది పేదవారికి 10 కిలోల బియ్యం, మరో దాత సహకారంతో 10 మందికి రూ 300 చొప్పున నగదు పంపిణీ చేశామని వాసవి క్లబ్ అధ్యక్షులు చింత రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ కార్యదర్శి చక లం రవి, పీఆర్ఓ ఐత శంకర్, వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు తొడుపునూరి కృష్ణవేణి, కార్యదర్శి కొమరవెల్లి కల్పన, ట్రెజరర్ తిమిశెట్టి విజయలక్ష్మి పాల్గొన్నారు.

కనీస వేతనాల జీఓను సవరించాలి

- బీఎంఎస్ జిల్లా నాయకులు మద్దెల ప్రవీణ్



నవతెలంగాణ-మిరుదొడ్డి

రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాల జీఓను వెంటనే సవరించి కనీస వేతనం రూ.21 వేలకు పెంచాలని బీఎంఎస్ జిల్లా నాయకులు మద్దెల ప్రవీణ్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో పరీక్షించి ఈపీఎఫ్ 95 పెన్షన్ 7500 పెంచి కరువు భత్యంను చెల్లించాలన్నారు. అవుట్సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులకు రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లు, అంగన్వాడీఎస్, ఇతర స్కీం వర్కర్లకు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఎంఎస్ నాయకులు మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

16న కేసీఆర్ క్రికెట్ ట్రోఫీ ఆరంభ వేడుకలు

- ప్రారంబానికి ముఖ్య అతిథులుగా మంత్రి హరీశ్ రావు, న్యాచురల్ హీరో నాని, అంబటి రాయుడు
- ట్రోఫి నిర్వహకులు మచ్చ వేణుగోపాల్ రెడ్డి, కలకుంట్ల మల్లిఖార్జున్



నవతెలంగాణ-సిద్దిపేట

సీఎం కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా మంత్రి హరీశ్‌రావు ఆధ్వర్యంలో ప్రతి ఏటా సిద్దిపేటలో నిర్వహించే సీఎం కేసీఆర్ ట్రోఫీ ప్రారంభోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు టోర్నీ నిర్వాహకులు మచ్చ వేణుగోపాల్ రెడ్డి, కలకుంట్ల మల్లి ఖార్జున్‌లు తెలిపారు. సోమవారం మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ ప్రారంభానికి మంత్రి హరీశ్ రావు, న్యాచురల్ స్టార్ నాని, క్రికెట్ క్రీడాకారుడు అంబటి తిరుపతి రాయుడు ముఖ్య అతిథులుగా వస్తున్నట్లు తెలిపారు. 19 లక్షలకు పైగా సబ్ స్క్రైబర్ కలిగిన క్రిక్ హీరోస్ యాప్‌లో టోర్నీ ... ఆఫ్ ద ఇయర్‌గా సీఎం కేసీఆర్ ట్రోఫీ నిలిచిందని, దీనికి సంబంధించిన అవార్డును కూడా ఈ ప్రారంభ వేడుకలలో మంత్రి హరీశ్ రావు అందుకొనున్నట్లు తెలిపారు. ఈ నెల 17 నుంచి నిర్వహించనున్న సీఎం కేసీఆర్ ట్రోఫీ ప్రారంభోత్సవ వేడుకలను 16న సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు నిర్వహిస్తామన్నారు. ఇదే వేదికపై నేచురల్ స్టార్ నాని నటించిన దసరా చిత్రానికి సంబంధించిన వాల్ పోస్టర్ అభిమానులు, సిద్దిపేట ప్రజల మధ్య విడుదల చేయనునట్లు తెలిపారు. అంతర్జాతీయ స్థాయి క్రికెట్ స్టేడియంకు ఏ మాత్రం తీసిపోకుండా సిద్దిపేట స్టేడియంను అభివృద్ధి చేసిన ఘనత మంత్రి హరీశ్‌రావుకే దక్కుతుందన్నారు. క్రికెట్‌లో గుర్తింపు పొందడానికి గ్రామీణ, పట్టణ క్రీడాకారులకు మంచి అవకాశం అన్నారు. టోర్నమెంట్లో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ కు సంబంధించిన రిఫరీలు ఎంపైర్ లు గా వ్యవహరిస్తారని, పూర్తి అంతర్జాతీయ నియమ నిబంధనలతో టోర్నీ కొనసాగుతుందన్నారు. టోర్నీ విన్నర్‌కు రెండు లక్షల నగదు బహుమతి, రెండవ బహుమతిగా లక్ష రూపాయల నగదుతో పాటు, మ్యాన్ ఆఫ్ ద సిరీస్ రూ 50 వేల నగదు బహుమతి ఉంటుందన్నారు. ప్రతి మ్యాచ్‌లో ఉత్తమ ప్రతిభ కనపరిచిన వారికి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ వెయ్యి రూపాయల నగదు, సిక్స్ కొట్టిన వారందరికీ ప్రతి సిక్స్‌కు రూ 500 నగదు బహుమతి ఉంటుందన్నారు. వేడుకల అనంతరం కేసీఆర్ జన్మదిన వేడుకల్లో భాగంగా కేక్ కట్ చేస్తామని తెలిపారు. సిద్దిపేట నియోజకవర్గ యువత, క్రీడాభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంత్రి వ్యక్తి గత సహాయకులు రామచందర్ రావు (రాము), ప్రశాంత్ గౌడ్, రాజు, విజయ్, టీఆర్ఎస్వి నాయకులు రమేష్, బిక్షపతి, గుజ్జ రాజు, భాస్కర్, నరేష్, అరవింద్ రెడ్డి, రాము ఆకుబత్తిని, కర్రోళ్ల సతీష్, కిరణ్ గౌడ్, కమల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

దేశ సంపదను ఆదానికి దోచిపెడుతున్న ప్రధాని

- జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి



నవతెలంగాణ-మద్దూరు

దేశ సంపదను ప్రధాని నరేంద్ర మోడీ తన స్నేహితుడు అదానికి దోచిపెడుతున్నాడని జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బద్దిపడ కృష్ణారెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఓర్వడం లేదన్నారు. దేశ సంపదను మొత్తం మోడీ కార్పొరేట్ చేతుల్లో పెట్టి భారతదేశాన్ని అప్పులపాలు చేస్తున్నాడని ఆయన మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ రైతుల కోసం సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నారన్నారు. అధికారులు ప్రజా ప్రతినిధులు సమన్వయంతో కలిసి పనిచేస్తేనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమన్నారు. అంతకుముందు అధికారులు తమ తమ నివేదికలను సర్వసభ్య సమావేశం ముందు ఉంచడంతో ఎంపీటీసీలు గుజ్జుక సమ్మయ్య నందన బోయిన నరసింహులు కూరెళ్ళ రాజు గౌడ్ వ్యవసాయ శాఖ అధికారి బూరల రామకృష్ణను నిలదీశారు గ్రామాలలో రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించడం లేదని వ్యవసాయ శాఖ అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు విద్యుత్ శాఖ అధికారులు రైతులకు 24 గంటలు కరెంటు ఇవ్వడం లేదని ప్రజాప్రతినిధులు విద్యుత్ శాఖ అధికారులను నిలదీశారు. దీంతో రేపటి నుంచి 18 గంటల విద్యుత్ రైతులకు అందిస్తామని సభకు అధికారులు తెలిపారు. పలు శాఖలపై సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు అధికారులను నిలదీశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మలిపెద్ది సుమ మల్లేశం రైతుబంధు కోఆర్డినేటర్ మేక సంతోష్ కుమార్, చేర్యాల వ్యవసాయ శాఖ మార్కెట్ కమిటీ చైర్మన్ సుంకరి మల్లేశం, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు వంగా భాస్కర్ రెడ్డి, తహసిల్దార్లు భూపతి, గోపాల్ ఎంపీడీవో శ్రీనివాస్ గౌడ్ వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బట్ట కప్స్‌తో ఆరోగ్యం



- రుతుప్రేమ చైతన్య ర్యాలీలో జెడ్పీ చైర్ పర్సన్ రోజా శర్మ

నవతెలంగాణ-చిన్నకోడూరు

మహిళలు అందరూ ప్లాస్టిక్ కప్స్ వాడకుండా బట్ట కప్స్ మాత్రమే వాడాలని జిల్లా జెడ్పీ చైర్ పర్సన్ రోజా రాధాకృష్ణ శర్మ తెలిపారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండల కేంద్రంలో రుతుప్రేమ చైతన్య ర్యాలి చేపట్టి, రుతు ప్రేమపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వాడితే ఎన్నో అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని, మహిళలు ప్లాస్టిక్ కప్స్ వాడకుండా బట్ట కప్స్ మాత్రమే వాడాలని మహిళలచే ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. భారతదేశంలోనే మొట్టమొదటిసారిగా సిద్దిపేట జిల్లాలో రుతు ప్రేమ పైన మహిళకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో మహిళలకు రుతుప్రేమపైన అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. నారాయణరావుపేట మండల వ్యాప్తంగా మహిళలకు రుతు ప్రేమ పైన అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబాలు బాగుంటాయని అన్నారు. జిల్లాలో అన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమంపైన అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మాణిక్య రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వనిత రవీందర్ రెడ్డి, సర్పంచుల పోరం మండల అధ్యక్షులు ఉమేష్ చంద్ర, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు శ్రీనివాస్, ఎంపీడీవో శ్రీనివాస్, సర్పంచులు కవిత, విజయలక్ష్మి చిన్నకోడూరు ఎంపీటీసీ1 శారదా రమేష్, మహిళలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ద్వితీయ స్థానం



నవతెలంగాణ-మిరు దొడ్డి

విద్యతోపాటు క్రీడారంగంలో ప్రతి ఒక్కరు ముందుండాలని గొట్టం భైరయ్య (వర్కింగ్ ప్రెసిడెంట్), పీవీ.రమణ జనరల్ సెక్రెటరీలు అన్నారు. ఈ నెల 10వ తేది నుంచి 12 వరకు జరిగిన రాష్ట్ర స్థాయి 41వ సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్షిప్-2022-23 పోటీలు నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ విజయ్ హై స్కూల్‌లో జరిగాయి. పోటీల్లో ఓల్డ్ ఎం.ఐ.జి శ్రీవాణి విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు మంచి ప్రతిభను కనబరిచి ఉమ్మడి మెదక్ జిల్లా జట్టును రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిపారు. సెమీస్‌లో కరీంనగర్‌తో జరిగిన రసవత్తరమైన పోటీలో అద్వితీయమైన పోటీనిచ్చి ఫైనల్‌కు చేరారు. ఫైనల్ ఖమ్మం జట్టుతో జరిగిన మ్యాచ్‌లో అతి తక్కువ స్కోర్‌తో జిల్లా జట్టు ఓడి ద్వితీయ స్థానంతో సరిపెట్టుకుంది. రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ చైర్మెన్ శ్రీనివాసరావు, అధ్యక్షులు రామకృష్ణరావ్,సెక్రెటరీ రవీందర్ చేతుల మీదుగా జిల్లా క్రీడాకారులు బహుమతులు అందుకోనున్నారు. రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం సాధించిన జిల్లా జట్టుని మెదక్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులు శ్రీనివాసరావు, శ్రీనివాసరెడ్డి, పాషా, శరణప్ప, మంజీర యూత్ ప్రతినిధులు, సీనియర్ క్రీడాకారులు చెన్నై భూపాల్, తోట వెంకట్ రెడ్డి,అందే రామచంద్రం, చెన్నై లచ్చయ్య, బోయిని శ్రీనులు అభినందించారు.

ఘనంగా స్వయం స్వపరి పాలన దినోత్సవం



నవతెలంగాణ-చేర్యాల

మండల పరిధిలోని చిట్యాల గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం స్వయం స్వపరి పాలన దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం పాఠశాల అవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.సంతోష్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల స్థాయిలో చదువుతోపాటు పాఠ్యాంశ కార్యక్రమాలలో పాల్గొనడం ద్వారా ఉన్నత లక్ష్యాలు ఏర్పరచుకోవడానికి అవకాశాలు ఏర్పడతాయన్నారు. ఆ దిశగా విద్యార్థులు ప్రయత్నం చేసి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. మండల విద్యా శాఖ అధికారిగా బొడ్డు కార్తీక్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులుగా సార్ల కావేరి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలుగా వలాద్రి సౌమ్య, ఉపాధ్యాయులుగా విద్యార్థులు విధులు నిర్వర్తించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి.జ్యోతి, ఉపాధ్యాయులు రామకిషన్, నవిత, నర్సింహులు, సత్యనారాయణ, శ్రీనివాస్, బాలకృష్ణ, శారద, కొడిపల్లి ప్రశాంత్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

మనుధర్మ పుస్తక ఆవిష్కరణను ఉపసంహరించుకోవాలి



నవతెలంగాణ- గజ్వేల్

మనిషిని మనిషిగా చూడ నిరాకరించిన మనుధర్మ పుస్తకావిష్కరణను ఉపసంహరించుకోవాలని డీబీఎఫ్ నాయకులు డిమాండ్‌చేశారు. డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణులిలు డిమాండ్ చేశారు. ఆర్య వీర్ దళ్, సమరతసమతా వేదిక ఆధ్వర్యంలో సమతా మూర్తుల ప్రేరణ సభ ముసుగులో జరుగుతున్న మనుస్మృతి అధర్మశాస్త్రాన్ని గ్రంథావిష్కరణ చేయడం అప్రజాస్వామ్యన్నారు. ప్రాచీన రాజ్యాంగం అని చెప్తు మనుస్మృతిని అవిష్కరిస్తున్నారంటే భారత రాజ్యాంగాన్ని అవహేలన చేస్తూ యావత్ మూలనివాసి ప్రజానీకాన్ని మళ్ళీ బానిసత్వంలోకి నెట్టే ప్రయత్నం చేస్తు అవమానిస్తున్నారన్నారు. తొలి ప్రతిని నిత్యం అంబేడ్కర్‌ను అవమానిస్తూ కటకటాల పాలైన హమారా ప్రసాద్‌కు ఇవ్వడాన్ని చూస్తూంటే యావత్ తెలంగాణలో శాంతిభద్రతల సమస్యను సృష్టించి ప్రజల మధ్య విభేదాలను పెంచి పోషించే కుట్రపన్నుతున్నరన్నారు. భారత రాజ్యాంగం అందించిన స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావాన్ని సమానత్వహక్కులను నిరాకరించి, తిరిగి అధర్మ శాస్త్రాన్ని అమలు కోసం బ్రహ్మణవాదులు, మనువాదుల కుట్రలను తిప్పి కొట్టాలని కోరారు. ఈ పుస్తకవిష్కరణను నిలిపివేసి శాంతిభద్రతలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. లేని యెడల పుస్తకావిష్కరణను అడ్డుకుంటామని హెచ్చరించారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్‌కు మాతృవియోగం

- పరామర్శించిన బీఆర్ఎస్ నేతలు



నవతెలంగాణ-మర్కుక్

వంటి మామిడి మార్కెట్ కమిటీ డైరెక్టర్ బబ్బూరి రాందాస్ గౌడ్ మాతృమూర్తి బబ్బూరి లక్ష్మీ నర్సమ్మ(98) సోమవారం తెల్లవారుజామున మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎఫ్డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, వంటి మామిడి మార్కెట్ చైర్మన్ ఎం.డి జహంగీర్,వైస్ చైర్మన్ కె.భూపాల్ రెడ్డి, బీఆర్ఎస్ మర్కుక్ మండలాధ్యక్షులు మర్కుక్ కర్నాకర్ రెడ్డి, ఎంపీపీ పాండుగౌడ్, జెడ్పీటీసీ యెంబరి మంగమ్మ రాంచంద్రం యాదవ్, వైస్ ఎంపీపీ మంద బాల్ రెడ్డి, బీఆర్ఎస్ బీసీ సెల్ మండలాధ్యక్షులు మేకల కనకయ్య ముదిరాజ్, మర్కుక్ సర్పంచ్ అచ్చంగారి భాస్కర్, వంటి మామిడి మార్కెట్ డైరెక్టర్లు తిరుపతి నాయక్, గణేష్, రామకృష్ణ రెడ్డి, అత్మ కమిటి డైరెక్టర్ యావగారి సంతోష్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సింగం సత్తయ్య, సర్పంచులు ఆశోక్, లక్ష్మీ రాములు గౌడ్, మాధవి రాజి రెడ్డి, తదితరులున్నారు.



కంటి వెలుగు నిరుపేదలకు అండ



- 23 వ వార్డు కౌన్సిలర్ నాయకం లక్ష్మణ్

నవతెలంగాణ-సిద్దిపేట

కంటి వెలుగు పథకం నిరుపేదలకు ఆర్థికంగా అండగా నిలిచిందని, ఉచితంగా అద్దాలు, మందులు కూడా లభిస్తున్నాయని 23 వ వార్డు కౌన్సిలర్ నాయకం లక్ష్మణ్ అన్నారు. సోమవారం 23వ వార్డులో ఇంటింటికి తిరుగుతూ రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా ప్రిస్కిప్షన్ అద్దాలను (దూరపు చూపు అద్దాలను) పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పింజర అశోక్, దయాకర్, కృష్ణ, ఏ ఎస్ ఎం వాణి, వార్డ్ ప్రజలు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

ఉపాధి హామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని పందిల్ల సర్పంచ్ తోడేటి రమేష్ అన్నారు. సోమవారం పందిల్ల గ్రామంలో ఉపాధి హామీ పనులను ప్రారంభించారు. జాబ్ కార్డు కలిగిన కూలీలకు 100 రోజులు పని కల్పించేలా చూస్తామన్నారు. గ్రామంలో ఉపాధి హామీ పనులకు కూలీల సంఖ్య పెంచేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్ తాడూరి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలి



నవతెలంగాణ-చేర్యాల

కోతలు లేకుండా విద్యుత్ ను సరఫరా చేయాలని తెలంగాణ రైతు సంఘం మండల కార్యదర్శి కత్తుల భాస్కర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో సోమవారం రైతు సంఘం ఆధ్వర్యంలో విద్యుత్ ఏ ఈ కి వినతిపత్రం అందజేశారు.అనంతరం భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ విద్యుత్ కోతల వల్ల వేసిన వరి పంటలు ఎండిపోతున్నాయని, విద్యుత్ ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల సహాయ కార్యదర్శి పొనుగోటి శ్రీనివాస్ రెడ్డి, గ్రామ కార్యదర్శి కత్తుల నరసింహారెడ్డి,గొన్నెపల్లి చంద్రం, బోకూరి నరేష్, ఎల్లయ్య, మల్లయ్య, పోచయ్య రాములు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన ట్రైనీ కలెక్టర్, ఎంపీడీవో



నవతెలంగాణ-నంగునూరు

ట్రైని కలెక్టర్, నంగునూరు ఎంపీడీవో ఫైజా అహ్మద్ సోమవారం నంగునూరు ఉన్నత పాఠశాలను సందర్శించారు. మధ్యాహ్న భోజనాలు పరిశీలించి విద్యార్థులకు ఏ విధంగా వడ్డన చేస్తున్నారని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానం రాబట్టి గణిత సబ్జెక్ట్‌ను బోధించారు. విద్యార్థులు చెప్పిన సమాధానాలతో సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట మండల విద్యాధికారి తగిరెడ్డి దేశిరెడ్డి, ఇంచార్జి ఎంపిడిఓ వేణుగోపాల్, పాఠశాల ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-జగదేవపూర్

ప్రతి వ్యక్తి కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని గజ్వేల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రచమల్ల ఉపేందర్ రెడ్డి కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల ప్రభుత్వం అని అన్నారు. ప్రతి వ్యక్తి కంటి పరీక్షలు చేసుకొని అవసరమైన వైద్యం, కళ్ళ అద్దాలు పొందాలని తెలిపారు. ఆపరేషన్ అవసరమున్న వృద్ధులు ఆపరేషన్ చేసుకొని కంటి చూపును పొందాలన్నారు.

బసనికుంట కబ్జాను ఆపాలి

- తహశీల్దారు వినతి పత్రం అందజేత
- పాములపర్తి సర్పంచ్ తిర్మల్ రెడ్డి



నవతెలంగాణ-మర్కుక్

పాములపర్తి గ్రామంలోని బసని కుంట కబ్జా నుంచి కాపాడాలని మర్కుక్ తహశీల్దారు భాగ్యరేఖకు పాములపర్తి సర్పంచ్ పాములపర్తి తిర్మల్ రెడ్డి వినతిపత్రం సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బసనికుంట గతంలో సర్వే చేసి హద్దులు ఫిక్స్ చేసినా కుంట అన్యాక్రాంతం అవుతుందని, బతుకమ్మ పండుగకు అక్కడే బతుకమ్మ అడుతారని తెలిపారు. తహశీల్దారుకు వినతిపత్రం అందజేసిన వారిలో ఉప్పసర్పంచ్ పద్మనర్సింలు, వార్డు సభ్యులు చెక్కలి మలేష్ లక్ష్మణ్, నాగరాజు , తదితరులున్నారు